అన్నదాతకు అండగా!

జిల్లాలో 'రైతన్నా-మీకోసం' వారోత్సవాలు

- ఈ నెల 30 వరకు నిర్వహణ
- రైతుల నుంచి సమాచారం, సలహాలు, ఫిర్యాదుల స్వీకరణ

- కథనం 8వ పేజీలో..

ఇంటింటికీ కొళాయి సాకారం దిశగా..

నర్సీపట్నంలో పట్టాలెక్కనున్న సమగ్ర రక్షిత మంచినీటి పథకం

- రూ.185 కోట్లతో నిర్మాణం
- ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి
- కొత్త ఏడాదిలో పరుగులు పెట్టనున్న పనులు



సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించనున్న నర్సీపట్నం పెద్ద చెరువు



ఎండపల్లి వద్ద ఏలేరు కాలువను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

నర్సీపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):

పురపాలక సంఘంలో ఇంటింటికీ రక్షిత తాగునీటి కొళాయి కల సాకారం కాబోతోంది. రూ.185 కోట్లతో సమగ్ర రక్షిత మంచి నీటి పథకం పనులకు ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. త్వరలో కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ పూర్తి చేసి వర్క్ ఆర్డర్ ఇవ్వడానికి చర్యలు చేపడుతున్నారు. దీంతో నూతన సంవత్సరంలో పనులు పరుగులు పెట్టనున్నాయి.

2048 నాటికి జనాభా అవసరాలకు సరిపడా పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి ఈ పథకాన్ని రూపకల్పన చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.166 కోట్లతో పనులు చేపట్టారు. రెండు ప్యాకేజీల కింద కాంట్రాక్టర్లు రూ.25 కోట్ల పనులు పూర్తి చేశారు. బిల్లులు మంజూరులో తీవ్ర జాప్యం కారణంగా పనులు మధ్యలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను మొదలుపెట్టడానికి చర్యలు తీసుకున్నారు. అర్బన్ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధులు కింద నేషనల్ హౌసింగ్ బ్యాంకు నిధులతో సమగ్ర రక్షిత తాగునీటి పథకానికి గత నెలలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు.

ఇంటింటికి రక్షిత మంచినీరు

సమగ్ర రక్షిత మంచినీటి పథకం పూర్తయితే మునిసిపాలిటీలోని 28 వార్డులలో ప్రతీ ఇంటికి మంచినీటి కొళాయి అందుబాటులోకి వస్తుంది. 164 కిలోమీటర్లు నీటి సరఫరా పైప్ నడపడం ద్వారా 16,168 ఇళ్లకు కొళాయిలు మంజూరు చేయనున్నారు. ప్రతీ వ్యక్తికి రోజుకు 135 లీటర్లు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తారు. 2048 సంవత్సరంలో పురపాలక జనాభాను అంచనా వేసి పథకాన్ని రూపొందించారు. గత వైసీపీ ప్రభుత్వంలో 80 కిలోమీటర్లు పైపులైన్ వేశారు. ఇప్పుడు మిగిలిన పైపులైన్ వేస్తారు.

ఏలేరు నీటి ఆధారిత పథకం

ఏలేరు నీటి ఆధారిత పథకంగా మునిసిపాలిటీలో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేస్తున్నారు. కోటవురట్ల మండలం ఎండపల్లి వద్ద ఏలేరు నీటిని ఈ పథకానికి ఉపయోగిస్తారు. ఎండపల్లి వద్ద 40 సెంట్ల స్థలంలో సంపు నిర్మిస్తారు. ఏలేరు నీటిని సంపులోకి తోడి అక్కడ నుంచి మోటార్ల సహాయంతో జోగినాథునిపాలెం కొండ మీద నిర్మించిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తారు. అక్కడ నుంచి గ్రావెటీ ద్వారా నర్సీపట్నం పెద్ద చెరువులో నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ... మిగతా 6వ పేజీలో

రెవెన్యూ డివిజన్‌గా నక్కపల్లి

ముసాయిదా నోటిఫికేషన్ విడుదల

- సలహాలు, సూచనలు, అభ్యంతరాలు స్వీకరణ



అనకాపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో నక్కపల్లి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం ప్రభుత్వం ముసాయిదా నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేసింది. ఇప్పటికే కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం మంత్రివర్గ ప్రతిపాదన ప్రభుత్వానికి అందిన సంగతి తెలిసిందే. నక్కపల్లి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం కలెక్టర్ విజయకృష్ణన్ సమగ్ర నివేదికను ఇటీవల ప్రభుత్వానికి పంపారు. దీనికి ప్రభుత్వ ఆమోదం లభించడంతో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ నక్కపల్లి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం ముసాయిదా నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 24 మండలాలు ఉండగా అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లు ఉన్నాయి.

ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయనున్న నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌లో ఎలమంచిలి, రాంబిల్లి, మునగపాక, అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాలు ఉండనున్నాయి. అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో దేవరాపల్లి, కె.కోటపాడు, అనకాపల్లి, కశింకోట, బుచ్చెయ్యపేట, చోడవరం, పరవాడ, సబ్బవరం, చీడికాడ మండలాలు ఉంటాయి. నర్సీపట్నం డివిజన్‌లో నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం, నాతవరం, రావికమతం, మాడుగుల, రోలుగుంట మండలాలు ఉండనున్నాయి. ముసాయిదా నోటిఫికేషన్ జారీ అయిన నాటి నుంచి 30 రోజుల్లోగా సలహాలు, సూచనలు, అభ్యంతరాలుంటే కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ... మిగతా 6వ పేజీలో

అగ్రి ల్యాబ్ అందుబాటులోకి వచ్చేనా?

2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులకు శ్రీకారం

- సబ్బవరంలో ఐదు ఎకరాల్లో భవన నిర్మాణం ప్రారంభం
- వైసీపీ ప్రభుత్వంతో గ్రహణం
- 2022 నాటికి 90 శాతం పనులు పూర్తి
- నిధులు విడుదల చేయకపోవడంతో బ్రేక్
- పిచ్చిమొక్కలతో నిండిపోయిన భవనం పరిసరాలు
- కూటమి ప్రభుత్వంలోనైనా పనులు పూర్తవుతాయని రైతుల ఆశాభావం



అగ్రి ల్యాబ్ భవనం చుట్టూ తుప్పలు పెరిగిపోయిన దృశ్యం

సబ్బవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):

రైతులకు ఎంతో మేలు చేసే అగ్రి ల్యాబ్ అందుబాటులోకి రాకుండాపోయింది. గత వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ల్యాబ్ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఈ ల్యాబ్ భవనం పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. భవనం తలుపులు, కిటికీలు పాడైపోతున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ ల్యాబ్ నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.



పాడవుతున్న తలుపులు, కిటికీలు

పంటల సాగుకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులతో పాటు భూసార పరీక్షలు కీలకం. భూసార పరీక్షా కేంద్రాలు గతంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని జేడీ కార్యాలయంలో ఉండేవి. అయితే వీటిని రైతులకు మరింత చేరువ చేసేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక సమీకృత వ్యవసాయ ప్రయోగశాలను, ఉమ్మడి విశాఖ జిల్లా మొత్తానికి సబ్బవరంలో ప్రయోగశాలను ఏర్పాటు చేయాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది.

అగ్రి ల్యాబ్‌కు సబ్బవరంలో ఐదు ఎకరాల భూమిని 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. భవన నిర్మాణానికి రూ.3.5 కోట్లు, మౌలిక సదుపాయలు, ల్యాబ్ పరికరాల కోసం రూ.2.5 కోట్లు కేటాయించింది. అన్ని వసతులతో 2019 ఖరీఫ్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని భావించింది. కాగా 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో ల్యాబ్ పనులకు గ్రహణం పట్టింది. అయితే నిధులు మంజూరై, పరిపాలనా పరమైన అనుమతులు ఉండడంతో 2020లో అగ్రి ల్యాబ్ పనుల బాధ్యతను రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించింది. భవన నిర్మాణ వ్యయాన్ని రూ.3.5 కోట్లు నుంచి రూ.3.25 కోట్లకు కుదించి టెండర్ పిలిచింది. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టెండర్ నిర్వహించి తక్కువ కోట్ చేసిన సంస్థకు పనులు ... మిగతా 6వ పేజీలో

ఏసీబీ వలలో మారేడుపూడి వీఆర్వో

- రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



నగదుతో పట్టుబడిన వీఆర్వో సూర్యనారాయణ

అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రమణమూర్తి

భూమి మ్యూటేషన్‌కు రూ.20 వేలు లంచం తీసుకుంటూ మారేడుపూడి వీఆర్వో ఎం.సూర్యనారాయణ గురువారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.

అక్కిరెడ్డివానిపాలెం గ్రామానికి చెందిన సాలాపు సంజీవరావుకు 24 సర్వే నంబర్లలో కలిపి మొత్తం మూడున్నర ఎకరాల భూమి ఉంది. సంజీవరావు మే 30వ తేదీన మరణించారు. ఆయన పేరున ఉన్న ఆ భూమిని తన తల్లి దేముడమ్మ పేరున మార్చాలని కుమారుడు శ్రీను సెప్టెంబరులో వీఆర్వోకు దరఖాస్తు చేసుకున్నారు. 24 సర్వే నంబర్లకు సంబంధించి 19 సర్వే నంబర్లలోని భూమికి వీఆర్వో మ్యూటేషన్ చేశారు. మిగిలిన ఐదు సర్వే నంబర్లలో ఉన్న భూమిని మ్యూటేషన్ చేయడానికి రూ.50 వేలు లంచం అడిగారు. బుధవారం మధ్యాహ్నం వీఆర్వోను శ్రీను కలిసి రూ.20 వేలు ఇస్తానని చెప్పడంతో వీఆర్వో అంగీకరించారు. అయితే లంచం ఇవ్వడానికి మనసు అంగీకరించక శ్రీను బుధవారం సాయంత్రం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు శ్రీను గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చారు. అక్కడికి వచ్చిన వీఆర్వో సూర్యనారాయణకు రూ.20 వేలు లంచం ఇవ్వగా, అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో సీఐ, ఇతర సిబ్బంది వీఆర్వోను అరెస్టు చేశారు. గతంలో కూడా ఆయనపై అభియోగాలు ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై కూడా విచారణ చేస్తామని డీఎస్పీ విలేకరులకు తెలిపారు. వీఆర్వోను శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నామన్నారు. అంతేకాకుండా పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌లో గల వీఆర్వో ఇంట్లో కూడా ఏసీబీ అధికారి తనిఖీలకు వెళ్లినట్టు తెలిసింది.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దుకాణాల వేలం వివాదాస్పదం



ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న రెండు దుకాణాలు ఇవే

రెండు దుకాణాల అద్దె వేలం రద్దు?

- పాత అద్దె రూ.2.7 లక్షలు
- తాజాగా కేటాయించిన అద్దె నెలకు రూ.1.3 లక్షలు
- ఒకేసారి రూ.1.4 లక్షల అద్దె తగ్గిపోవడంపై స్థానికంగా విమర్శలు
- దుకాణాల కేటాయింపు నిర్ణయంపై వెనక్కి తగ్గిన ఆర్టీసీ అధికారులు

చోడవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రెండు దుకాణాలు అద్దెకు ఇచ్చేందుకు నిర్వహించిన వేలం వివాదాస్పదంగా మారడంతో ఈ దుకాణాలకు నిర్వహించిన టెండర్‌ను రద్దు చేస్తూ ఆర్టీసీ ఉన్నతాధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. దుకాణాల అద్దెకు నిర్వహించిన టెండర్‌లో కొందరు వ్యాపారులు రింగ్ అయి, గతంలో నెలకు రూ.2.70 లక్షలు ఉన్న అద్దె కంటే తక్కువగా నెలకు రూ.1.30 లక్షల అద్దెకు దుకాణాలు దక్కించుకోవడం, ఇది ఆరోపణలకు దారితీయడంతో ఈ టెండరు రద్దు చేసి మళ్లీ టెండరు పిలవాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు నిర్ణయించినట్టు సమాచారం.

ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చెందిన స్థలంలో అనేక షాపులు ఉన్నాయి. ఈ దుకాణాలు అద్దెకు తీసుకునేందుకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇందులో షాపు నంబరు 6, 7లకు కలిపి గతంలో రికార్డు స్థాయిలో అద్దె పలికింది. మూడేళ్ల క్రితం ఈ రెండు దుకాణాలకు ఏకంగా నెలకు రూ.3.10 లక్షలు అద్దెకు వెళ్లడంతో అప్పట్లో ఇది రికార్డుగా మారింది. ఆ తరువాత మూడు నెలలకే అంత మొత్తానికి వేలం పాడిన వ్యాపారి నెలకు రూ.3 లక్షలు పైబడి అద్దె కట్టలేకపోవడంతో మళ్లీ ఆర్టీసీ అధికారులు వేలం నిర్వహించారు. దీంతో ఈసారి నెల అద్దె రూ.2లక్షల 70వేలకు రెండు దుకాణాలు కేటాయించారు. అప్పటినుంచీ ఇదే అద్దె కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ రెండు దుకాణాలకు ఈ నెల 21న ఆర్టీసీ అధికారులు టెండర్ నిర్వహించారు. అయితే అనూహ్యంగా రూ. 2లక్షల 70 వేలు అద్దె వచ్చే రెండు దుకాణాలను కేవలం రూ.లక్షా 30 వేలకే కేటాయించడంతో స్థానికంగా ఈ వ్యవహారం రచ్చగా మారింది. ఒకేసారి లక్షా 40వేల రూపాయలు అద్దె తగ్గిపోవడంపై విచారణ జరపాలని, ఆర్టీసీ అధికారుల టెండర్ నిర్వహణ సమీక్షించాలని స్థానికంగా కొందరు వ్యాపారులు, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. టెండరుదారులు, ఆర్టీసీ సిబ్బంది కుమ్మక్కు కావడం వల్లే నెలకు ఏకంగా రూ.లక్షా 30 వేలు తక్కువ అద్దెకు దుకాణాలు కేటాయింపు జరిగిందని, దీని వలన సంస్థ ఆదాయానికి గండిపడిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఉన్న అద్దె కంటే ఎక్కువకు కోట్ చేసిన వారికే ఇవ్వాలని, లేదంటే టెండర్ రద్దు చేసి దుకాణాలు ఖాళీగా ఉంచాలంటూ ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆదేశించినట్టు సమాచారం. కాగా టెండర్ల సమాచారం వీలైనంత ఎక్కువమందికి తెలిసేలా చేయకపోవడం వలనే ఇటువంటివి జరుగుతున్నాయని పలువురు అంటున్నారు.

రైతన్నలో గుబులు

- వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో ఆందోళన



అనకాపల్లి మండలం శంకరంలో కోతలు కోసి పనల మీదున్న వరి కంకులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

మళ్లీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు వారాలుగా జిల్లాలో చల్లని వాతావరణం నెలకొనడమే కాకుండా మంచు విపరీతంగా కురుస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 54 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. ప్రస్తుతం జిల్లాలో కొన్ని మండలాల్లో ఖరీఫ్ వరి కోతలు మొదలయ్యాయి. మరికొన్ని మండలాల్లో వరి గింజకట్టి కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడిప్పుడే వరి కోతలు పూర్తి చేసుకొని రైతులు కుప్పలు వేసుకుంటున్నారు. కొన్ని మండలాల్లో రైతులు కోసిన వరి కంకులు ఇంకా పనల మీద ఉన్నాయి. ఈ తరుణంలో రానున్న రెండు, మూడు రోజుల్లో జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇతర పంటల పరిస్థితి అదే విధంగా ఉంది. కొద్ది రోజుల్లో పండిన వరి పంట చేతికందుతుందన్న తరుణంలో మళ్లీ వర్షాలు పడితే నష్టపోవాల్సి వస్తుందని రైతులు గుబులు చెందుతున్నారు. బుధవారం జిల్లాలో ఎక్కడా వర్షం పడకపోయినా వాతావరణ శాఖ రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తుండడంతో రైతులు ఇప్పటికే కోసిన వరి పనలను జాగ్రత్త చేసుకొనే పనిలో నిమగ్నమయ్యారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట కోత పనులను వాయిదా వేసుకుంటున్నారు.



విశేషాలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

వైభవంగా మార్గశిర మాస తొలి గురువారం పూజలు

- కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో తొలి గురువారం పూజలు వైభవంగా జరిగాయి. అమ్మవారి దర్శనానికి బుధవారం అర్ధరాత్రి నుంచి భక్తులు పోటెత్తారు. దీంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి.

- వార్త 8వ పేజీలో..

నిబంధనలు పాటించని డయాగ్నొస్టిక్ సెంటర్ సీజ్



సీజ్ చేసిన జ్యోతి డయాగ్నొస్టిక్ సెంటర్

ఎస్.రాయవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని అడ్డరోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జ్యోతి డయాగ్నొస్టిక్ సెంటర్ అనే ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌ను గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు సీజ్ చేశారు. ముందుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి హైమావతి, జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి వీరజ్యోతి సిబ్బందితో పాటు ఈ ల్యాబ్‌ను సందర్శించి నిర్వాహకురాలు ఉమకు ల్యాబ్‌ను సీజ్ చేస్తున్నట్టు నోటీసు అందజేశారు. అనంతరం స్థానిక తహశీల్దార్ రమేశ్‌బాబు సమక్షంలో జ్యోతి డయాగ్నొస్టిక్ సెంటర్‌కు సీజ్ చేశారు. దీనికి సంబంధించి డీఎంహెచ్‌వో హైమావతి మాట్లాడుతూ గత నెలలో ఈ ల్యాబ్‌లో తనిఖీలు నిర్వహించామని, నిబంధనలకు విరుద్ధంగా ఎక్స్‌రే, ఈసీజీ వంటివి చేయడంలో లోపాలను గుర్తించామని చెప్పారు. దీనిపై నిర్వాహకురాలికి రెండు సార్లు నోటీసులు ఇచ్చినా సమాధానం లేకపోవడంతో సీజ్ చేశామన్నారు. కాగా నిర్వాహకురాలు ఉమా అధికారుల ఎదుట ఆందోళన చేశారు. తాను బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు తన భూములు ఇవ్వకుండా పోరాడుతున్నందునే కక్ష సాధింపుగా తన ల్యాబ్‌ను సీజ్ చేశారని ఆరోపించారు.

మహిళల భద్రతపై అవగాహన ఉండాలి

▸ డీఎస్పీ శ్రీనివాసులు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. గురువారం బ్రాండిక్స్ కంపెనీలో మహిళా ఉద్యోగులకు భద్రత, సైబర్ నేరాలు వంటి వాటిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నూతన క్రిమినల్ చట్టాలు, గృహహింస చట్టాలు, బాలికలపై నిరోధించడానికి పోక్సో చట్టం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు శక్తి యాప్ వినియోగించడం ద్వారా పోలీసుల తక్షణ సహాయం అందే ప్రయోజనం ఉందన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల వాడకంతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నీలిమ, ఎస్ఐ రాములమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలి : ఐద్వా

అచ్యుతాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే బస్సు సర్వీసుల సంఖ్య పెంచాలని ఐద్వా జిల్లా జాయింట్ సెక్రటరీ ఆర్.లక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం అచ్యుతాపురం జంక్షన్‌లో గల పలు సమస్యలపై ఆమె మహిళలతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం పెట్టిన తర్వాత బస్సులను ఆపకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వైపు, విశాఖపట్నం వైపుకు వెళ్లడానికి బస్సులు లేవన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అచ్యుతాపురం జంక్షన్‌లో బస్టాప్ ఏర్పాటు చేసి, బస్సు సర్వీసులను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల నాయకులు ఈశ్వరమ్మ, లక్ష్మి, జ్యోతి, రాణి, సౌజన్య, లావణ్య, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కల్లాల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు



పేటకట్టు రైతులతో మాట్లాడుతున్న కర్రి సాయికృష్ణ

మునగపాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణ కోసం రైతులు సంచరించే ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్నానని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అన్నారు. మునగపాక పేటకట్టు రైతు కల్లాలు రోడ్డు మార్గంలో సాయికృష్ణ సొంత నిధులతో గురువారం విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు రాత్రి ఎనిమిది గంటల వరకు పొలం, పాడి పనులు చేస్తూ చీకటి కారణంగా విషసర్పాలతో పాటు పలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వారికి రక్షణగా నిలుస్తుందనే ఉద్దేశంతో అన్ని ప్రాంతాల్లో లైట్లు ఏర్పాటు చేస్తున్నానని చెప్పారు.

'రామాలయం పునర్‌నిర్మాణానికి కృషి'

రాంబిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టుబోలు పురాతన రామాలయం పునర్‌నిర్మాణానికి తాను కృషిచేస్తానని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. గురువారం ఆయన కట్టుబోలులో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలు, రామాలయం పునర్నిర్మాణ పరిస్థితిని గ్రామ పెద్దలను అడిగి తెలుసుకున్నారు. రామాలయం విషయమై రాష్ట్ర దేవదాయ కమిషనర్‌ను సంప్రదించి, ఆలయం పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూస్తానని గ్రామ పెద్దలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు అగ్రహారపు బాబూరావు, దశమంతరావు వెంకట సన్నయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న జనసేన నేతలు, అయ్యప్ప భక్తులు

ఎలమంచిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి మాలధారణ చేసి 41 రోజులు పాటు దీక్ష శుభప్రదంగా ముగియడంతో గురువారం యర్రవరంలో వృద్ధులు, బాలింతలకు దుప్పట్లను కొక్కిరాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మోటూరి గోపీ ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నడిగట్ల తాతాజీ, సంతోష్ కుమార్, మహేష్, శ్రీను, అశోక్ పాల్గొన్నారు.

పలుగ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అచ్యుతాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ లైన్లు మార్పిడి జరుగుతున్నందున శనివారం పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్, అచ్యుతాపురం ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వెదురువాడ, గొర్లె ధర్మవరం, మెట్ట ధర్మవరం, లంక ధర్మవరం, మార్టూరు రోడ్డు, సాయిప్రియ లేఅవుట్, జగనన్న కాలనీ, ఆర్‌ఆర్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, వెంకటాపురం జంక్షన్, దిబ్బపాలెం, మోసయ్యపేట, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, భోగాపురం రోడ్, ఎస్‌టీబీఎల్ కాలనీ, అచ్యుతాపురంల్లో ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఎంపీ సీఎం రమేశ్ తల్లి మృతి పట్ల నగేశ్ సంతాపం

పాయకరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్ మాతృమూర్తి రత్నమ్మ మృతి పట్ల జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నానన్నారు.

ఇంట్లో ఉండగా తాళం వేసిన వారిపై ఫిర్యాదు

ఎలమంచిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్న బద్ది ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఉదయం ఇంటిలో ఉండగా ఇంటి ఓనరు అల్లుడు కె. సన్యాసిరావు, ఆయన భార్య ఇంటి లోపల ఉండగా తాళం వేసి, దుర్భాషలాడారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కనమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎస్.రాయవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం తొలి గురువారం కావడంతో మండలంలోని కర్రివానిపాలెం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

వ్యర్థాలతో మినీ పార్కు



మునిసిపల్ కార్యాలయం వద్ద వ్యర్థాలతో ఏర్పాటు చేసిన మినీ పార్కు

పాత టైరు ముక్కలు, ఖాళీ సీసాల్లో మొక్కల పెంపకం

మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు

చూపరులను ఆకట్టుకుంటున్న మొక్కలు

ఎలమంచిలి మునిసిపల్ కార్యాలయం వద్ద వ్యర్థాలతో ఏర్పాటు చేసిన మినీ పార్కు చూపరులను ఆకట్టుకుంటున్నది. వాడిన టైర్ల ముక్కలు, ఖాళీ ప్లాస్టిక్ సీసాలకు రంగులు అద్ది వాటిలో మొక్కలు పెంచి మినీ మొక్కల పార్కుగా ఏర్పాటు చేశారు. మునిసిపాలిటీలోని ఎన్టీఆర్ వార్డుకు చెందిన సచివాలయ శానిటరీ సెక్రటరీ రమణ తన ఆలోచనతో తయారు చేసి అమర్చిన ఈ మొక్కల పెంపకం అందరినీ ఆలోజింపచేస్తోంది. -ఆంధ్రజ్యోతి/ ఎలమంచిలి





టైర్ల ముక్కల్లో ఏర్పాటు చేసిన మొక్కలు (ఇన్‌సెట్‌లో) ఖాళీ ప్లాస్టిక్ సీసాల్లో మొక్కలు

తుఫాన్ హెచ్చరికతో ఆందోళనలో అన్నదాతలు

▸ కంకుల దశలో ఉన్న వరి పంట

▸ వర్షం కురిసినా.. గాలులు వేసినా

పంటకు తీవ్ర నష్టమంటున్న రైతులు



పెదరాంభద్రపురం సమీపంలో వరి పైరు

పాయకరావుపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడి తుఫాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారుల హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మొంథా తుఫాన్ నుంచి గట్టెక్కడంతో ఊపిరి పీల్చుకున్న రైతన్నలు ఇప్పుడు వరి పంట చివరి దశలో ఉన్న సమయంలో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖాధికారులు ప్రకటించడంతో భయపడుతున్నారు. మండలంలో సాగునీటి కాలువలు, బోర్లు కింద 2,320 హెక్టార్లలో రైతులు వరిని సాగు చేపట్టారు. ఈ ఏడాది రైతులు వరి నాట్లు ఆలస్యంగా వేశారు. ప్రస్తుతం వరి పంట కంకులు దశలో ఉన్నాయి. కొన్నిచోట్ల గింజలు పాలుపోసుకునే దశలో ఉన్నాయి. మొంథా తుఫాన్ సమయంలో మండలంలో వరి చేనులు పొట్టదశలో ఉండడంతో ఎటువంటి నష్టం కలగలేదు. ప్రస్తుతం వర్షాలు, గాలులు వీస్తే వరి చేను నేలకొరిగి తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడం నాట్లు వేసిన తరువాత ఎండలు తీవ్రంగా కాయడంతో వరి చేనులు ఏపుగా ఎదగలేదు. కలుపు పెరిగింది. దీంతో రైతులు కలుపుతీతకు, ఎరువులకు, క్రిమిసంహారక మందులకు అధికంగా పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం వరి చివరి దశలో ఉంది. పంట పండి చేతికంది సమయంలో తుఫాన్‌గా మారే అవకాశం ఉండడంతో గండం నుంచి గట్టెక్కాలని దేవుడిని మొక్కుకుంటున్నారు.

బాలికోన్నత పాఠశాలలో మూడు ల్యాబ్‌లు

▸ ఎస్ఎస్ఏ ఈఈ నరసింగరావు



పాయకరావుపేటలో వాటర్ ట్యాంక్ పక్క స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ ఇంజనీరింగ్ విభాగం ఈఈ నరసింగరావు తదితరులు

పాయకరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలకు అవసరమైన మూడు ల్యాబ్‌లను రూ.68 లక్షలతో నిర్మించనున్నట్టు సర్వశిక్షాభియాన్ ఇంజనీరింగ్ విభాగం ఈఈ నరసింగరావు తెలిపారు. గురువారం ఇక్కడకు వచ్చిన ఆయన మంగవరంరోడ్డులో ఉన్న జడ్పీ బాలికోన్నత పాఠశాల సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలం, షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికోన్నత పాఠశాలకు అవసరమైన మూడు ల్యాబ్‌లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఈ గణేష్, ఏఈ మూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, చిరుకూరి పేర్రాజు, దేవారపు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనులు ముమ్మరం చేయండి

జడ్పీ సీఈవో నారాయణ మూర్తి



సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈవో పి.నారాయణ మూర్తి

నక్కపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ముమ్మరంగా శానిటేషన్ పనులను చేపట్టాలని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి సూచించారు. మండలంలోని సీహెచ్ఎల్ పురం గ్రామంలో గురువారం శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సకాలంలో సేకరించాలని ఆదేశించారు. మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్‌ను ఎప్పటికప్పుడు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో బి.చైతన్య, సెక్రటరీ వున్నారు.

నేడు 19 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాయవరం, ధర్మవరం అగ్రహారం, దార్లపూడి సబ్ స్టేషన్‌ల పరిధిలోని 19 గ్రామాల్లో శుక్రవారం నిర్వహించనున్న మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె రాజశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల బసవపాడు, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, సైతారుపేట, వేమగిరి, వాకపాడు, పెనుగొల్లు, సోముదేవుపల్లి, ధర్మవరం అగ్రహారం, గెడ్డపాలెం, అగ్రహారం, వమ్మవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

యువతలో మార్పు రావాలి

ఏయూ అభివృద్ధి మండలి డీన్ ప్రొఫెసర్ టీవీ.కృష్ణ



అటానమస్ విభాగాన్ని ప్రారంభిస్తున్న ఏయూ ప్రొఫెసర్ టీవీ.కృష్ణ

పాయకరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మెరుగైన సమాజం కోసం యువతలో మార్పు రావాలని ఆంధ్రా యూనివర్సిటీ అభివృద్ధి మండలి డీన్ ప్రొఫెసర్ టీవీ.కృష్ణ అన్నారు. గురువారం స్థానిక స్సెసెస్ డిగ్రీ కళాశాలలో అటానమస్ విభాగాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రం, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ తదితర ఇతర విభాగాలను పరిశీలించారు. అనంతరం ప్రొఫెసర్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకున్నపుడే ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. అనంతరం ఆయనకు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పురమిత్ర యాప్ వినియోగంలో 'ఎలమంచిలి' ఆరో స్థానం

ఎలమంచిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పురమిత్ర యాప్ వినియోగంలో ఎలమంచిలి మునిసిపాలిటీ రాష్ట్రంలో ఆరో స్థానంలో ఉందని కమిషనర్ ప్రసాదరాజు అన్నారు. మునిసిపాలిటీలో రహదారులు, కాలువలు, వీధి దీపాలు, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు తదితర పలు సమస్యలను పురమిత్ర యాప్‌లో పొందుపర్చారు. మునిసిపాలిటీలో ప్రజలకు ఈ యాప్‌ను సెల్‌ఫోన్‌లలో డౌన్‌లోడు చేసుకునేలా వారికి అవగాహన కల్పించామని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు, ఇప్పటి వరకూ మునిసిపాలిటీలో ఏడు వేల మంది ఇన్‌స్టాల్ చేసుకున్నారన్నారు.

ఈ యాప్ ద్వారా 376 సమస్యలపై అప్‌లోడ్ చేశారని, 283 పరిష్కారమయ్యాయన్నారు. ఈ యాప్‌పై సచివాలయాల పరిధిలో అధిక శాతం మందికి అవగాహన కల్పించేలా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. అధికంగా వీధి దీపాల నిర్వహణపై యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హైవేపై తప్పిన పెను ప్రమాదం

ముందు వెళుతున్న లారీ ఢీకొన్న మరో లారీ

ఢీకొన్న లారీ వెనక్కి వెళ్లడంతో ఢీకొట్టిన ప్రైవేటు బస్సు



ధర్మవరం అగ్రహారం వద్ద జరిగిన ప్రమాదానికి కారణమైన లారీ

ఎస్.రాయవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై గురువారం తుని వైపు నుంచి వస్తున్న లారీ ధర్మవరం అగ్రహారం వద్దకు వచ్చేసరికి ముందు వరికోత యంత్రాన్ని ఎక్కించుకొని వెళుతున్న మరో వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ముందు వాహనంపై ఉన్న వరికోత యంత్రం విడిపోయి రోడ్డుపై పడింది. అంతేకాకుండా ప్రమాదానికి కారణమైన లారీ ముందు వాహనాన్ని ఢీకొన్న వెంటనే వెనుక్కి వెళ్లింది. దీంతో ఆ లారీని వెనుక యాత్రికులతో వస్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. అయితే బస్ డ్రైవర్ అప్రమత్తంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం ఆ సమయంలో ఇతర వాహనాలు ఏవీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. జాతీయ రాహదారిపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ఆహ్వానించండి

మునిసిపల్ కమిషనర్‌కు టీడీపీ నేతల వినతి



మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజుకు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు గొర్లె నానాజీ, కొఠారు సాంబలు

ఎలమంచిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీలోని 25 వార్డుల్లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో టీడీపీ వార్డు ఇన్‌చార్జులను కలుపుకొని పోవాలని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజుకు టీడీపీ నేతలు వినతి పత్రం అందజేశారు. గురువారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, జిల్లా ప్రతినిధి కొఠారు సాంబ, నేతలు కరణం రవికుమార్, బొద్దపు శ్రీను, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ వీరంతా కమిషనర్‌ను కలిసి మునిసిపాలిటీలో జరిగే వివిధ కార్యక్రమాలకు తమకు ఆహ్వానం పంపడమే కాకుండా పాలనా కార్యక్రమాల్లో కలుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొద్దపు శ్రీను, కరెడ్ల వెంకట మల్లికార్జునరావు, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ గొర్లె బాబూరావు, రమేష్, రాములు పాల్గొన్నారు.

కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాలి

పాయకరావుపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాహెబ్‌పేట గ్రామంలో సాగునీటి కాలువపై ఉన్న కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామం నుంచి బీసీ కాలనీకి, రైతులు పొలాలకు ఈ కల్వర్టు మీదుగానే నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. చిన్న పిల్లలు, వృద్ధులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువపై కల్వర్టు నిర్మించి రక్షణ గోడలు నిర్మించలేదని నాయకులు, అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

మద్యం మత్తులో వీరంగం.. వ్యక్తి పై కేసు నమోదు

కె.కోటపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వీరంగం సృష్టించిన వ్యక్తిపై కేసు నమోదైంది. బాధితులు, పోలీసులు అందించిన వివరాలివి.. మండలంలోని కింతాడ గ్రామానికి కింతాడ శ్రీను భార్య కాంతం బుధవారం స్కూటీపై ప్రయాణిస్తుండగా అడ్డగించి అదే గ్రామానికి చెందిన సిరపరపు శివ స్వామినాయుడు అనే వ్యక్తి అవమానకరంగా మాట్లాడాడు. స్కూటీ తాళంతో ఆమె ఎడమ చేతిపై గాయపరిచాడు. అనంతరం భర్తతో కలిసి కాంతం శివ ఇంటికి వెళ్లి నిలదీయగా మద్యం మత్తులో ఉన్న అతను శ్రీనుపై అసభ్యరీతిలో మాట్లాడి, ప్రాణహాని చేస్తానని బెదిరించాడు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా నిందితుడు శివ స్వామినాయుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు గురువారం పోలీసులు తెలిపారు. గతంలో కూడా శివస్వామినాయుడు మర్డర్ కేసులో నిందితుడు. ప్రస్తుతం బెయిల్‌లో ఉన్నట్టు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు.

జంపపాలెంలో ధ్యాన సరస్వతి విగ్రహావిష్కరణ



జంపపాలెంలో ధ్యాన సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు, ఉపాధ్యాయులు

ఎలమంచిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపపాలెం ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ధ్యాన సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ అధ్యక్షురాలు వెంకట్, పొలమరశెట్టి నూకరత్నం దంపతుల ఆర్థిక సాయంతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

30న ఎలమంచిలి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ఎలమంచిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 30వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి గోవిందరావు తెలిపారు. ఈ మేళాలో 20 పరిశ్రమల ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగులు వినియోగించుకోవాలన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, పీజీ వరకూ చదువుకొని 18 నుంచి 35 సంవత్సరాల నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనవచ్చునన్నారు. వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని రిఫరెన్స్ నంబరుతో పాటు, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్స్, జెరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8142565416 నంబరును సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ

▸ బస్సులో దొరికిన మంగళసూత్రం అప్పగింత

రావికమతం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దొరికిన బంగారు మంగళ సూత్రం అప్పగించి ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీని నిరూపించుకున్నారు. వివరాలివి.. నర్సీపట్నం ఆర్టీసీ డిపోలో రావికమతం మండలం మేడివాడకు చెందిన ముచ్చకర్ల శ్రీను అవుట్‌సోర్సింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం సాయంత్రం నర్సీపట్నం వస్తుండగా భార్యాభర్తలు విశాఖలో తాను నడిపిన బస్సు ఎక్కి, గాజువాకలో దిగారు. ఆ సమయంలో ఆ మహిళ మెడలోని మంగళసూత్రం బస్సులో పడిపోయింది. ఇంటికి వెళ్లిన తర్వాత గుర్తించి గాజువాకలోని సిబ్బంది ద్వారా నుంచి విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు తెలిపారు. దీంతో ఆర్టీసీ అధికారులు బస్సు డ్రైవర్ శ్రీనుకు ఫోన్ చేశారు. అతను వెంటనే డిపోలో పార్కింగ్ చేసిన బస్సులో వెతకగా మంగళసూత్రం దొరికింది. గురువారం ఆర్టీసీ అధికారుల సమక్షంలో పోగొట్టుకున్న గాజువాకకు చెందిన దంపతులకు మంగళసూత్రం అందజేశారు. శ్రీను నిజాయితీని పలువురు అభినందించారు.

అర్హులందరికీ 'అన్నదాత సుఖీభవ'

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాస్ యాదవ్



.నారాయుడుపాలెంలో ఇంటింటి ప్రచారంలో కూటమి నాయకులు

మునగపాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం అందజేస్తోందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి సబ్బి శ్రీనివాసరావు యాదవ్ పేర్కొన్నారు. మండలంలో నారాయుడుపాలెంలో గురువారం అన్నదాత సుఖీభవ పథకంపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరమైన సమస్యలు కారణంగా కొంత మంది రైతులకు పథకం అందలేదని, వారు అధైర్య పడకుండా సమీప వ్యవసాయ శాఖ అధికారులను, సిబ్బందిని కలవడం ద్వారా లబ్ధి పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు వేయాలి

పాయకరావుపేట రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదటం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బీసీ కాలనీకి వెళ్లే పుంత రోడ్డును సిమెంటు రోడ్డుగా నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. చిన్న పాటి చినుకులు పడినా రోడ్డంతా బురదగా మారి నడవడానికి, రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో కాలనీకి, ఎంపీపీ పాఠశాలకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. నాయకులు, అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

'బాల్య వివాహాల రహిత జిల్లాగా అనకాపల్లి'



మొగలిపురంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సబ్బవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిని బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ డెవలప్‌మెంట్ (సీడ్) పని చేస్తుందని ఆ సంస్థ ప్రతినిధి జి. మీనాకుమార్ తెలిపారు. మండలంలోని మొగలపురంలో గురువారం సాయంత్రం 'బాల్య వివాహాల రహిత భారతదేశం' కార్యక్రమంలో భాగం కొవ్వొత్తులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బాల్య వివాహ ముక్త భారత్ ఏర్పాటై సంవత్సరం పూర్తయిన సందర్భంగా వంద రోజుల అవగాహన కార్యక్రమాల్లో భాగంగా విద్యా సంస్థలు, వివాహాలు జరిగే ఆధ్యాత్మిక సంస్థలు, గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలు మరియూ, మున్సిపల్ వార్డులలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలనకు దేశ వ్యాప్తంగా 250 సంస్థలు పనిచేస్తున్నాయని, 2024 నుంచి ఇప్పటి వరకు లక్ష్య బాల్య వివాహాలను అడ్డుకున్నాయని తెలిపారు. బాల్య వివాహలకు వ్యతిరేకంగా గ్రామీణ సమాజాల్లో విస్తృత చర్చ జరగాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సంరక్షణ కార్యదర్శి జాన్సీలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది గురి లక్ష్మీ, పుచ్చ పైడితలమ్మ, పెట్ల మహాలక్ష్మి, కోడి దాసు భారతి, పలువురు సభ్యులు, బాలికలు పాల్గొన్నారు.

బొజ్జన్న కొండ రోడ్డు వద్ద యూటర్న్ నిషేధం



యుటర్న్ నిషేధిస్తూ బొజ్జన్న కొండకు వెళ్లే మార్గంలో ఏర్పాట్లు

కొత్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం బొజ్జన్న కొండ వద్ద అప్రోచ్ రోడ్డు నుంచి లారీలు యూ టర్న్ తీసుకోవడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని రూరల్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. దీనిపై ప్రయాణికులు, స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో భారీ వాహనాలు, లారీలు యూ టర్న్‌ను నిషేధించేలా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీనివల్ల ప్రమాదాల నివారణతో పాటు జాతీయ రహదారిపై సురక్షితమైన ప్రయాణానికి అవకాశం ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అలాగే, బొజ్జన్న కొండ నుంచి వచ్చే లారీలు, భారీ వాహనాలను కోడూరు జంక్షన్ వద్ద నుంచి యూ టర్న్ తీసుకునేలా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని ప్రయాణికులు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే దృష్టికి స్పీడ్ బ్రేకర్ల వల్ల ఎదురయ్యే సమస్య'



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పరిశీలిస్తున్న కూటమి నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామ రాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఇరువైపులా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న కూటమి నాయకులు గురువారం వాటిని పరిశీలించారు. రైల్వే శాఖకు సంబంధించిన కాంట్రాక్టర్ అనాలోచిత నిర్ణయాలు, గైడ్‌లైన్స్ పాటించకుండా నిర్మించిన స్పీడ్ బ్రేకర్ల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా రైల్వేశాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారని ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు తెలిపారు. ఇదిలావుండగా, రైల్వేశాఖ ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల పట్ల వైసీపీ నాయకులు కూడా తీవ్ర అభ్యంతరం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్ బ్రేకర్ల వేశారని ఎత్తు, వెడల్పు తగ్గించాల్సి ఉందని వారు పేర్కొన్నారు.

మైదానంలో మంచు సోయగం



మాకవరపాలెంలో మంచు కురుస్తున్న దృశ్యం

మాకవరపాలెం, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : మైదాన ప్రాంతంలో మంచు దట్టంగా కురుస్తోంది. మాకవరపాలెంతో పాటు కొండలఅగ్రహారం, తామరం, రాచపల్లి గ్రామాల్లో గురువారం ఉదయం తొమ్మిది గంటలైనా సూర్యుని జాడ కనిపించలేదు. దట్టమైన పొగమంచు ఈ ప్రాంతాన్ని పూర్తిగా కమ్మేయండతో ఉదయం వేళ కూడా సాయంతాన్ని తలపిస్తోంది. ప్రదాన రహదారులపై పొగ మంచు కురవడంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పగటి వేళలో సైతం లైట్లు వెలుగులో వాహన రాకపోకలు సాగిస్తున్నాయి.

ప్రైవేటు పాఠశాలల పర్యవేక్షణకు కమిటీ

- డీఈవో అప్పారావునాయుడు వెల్లడి
- ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం
- తూ.తూ. మంత్రంగా హాజరు కావడంతో ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

కొత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, నిర్వాహకులు నిబంధనల ప్రకారం ఆయా పాఠశాలల నిర్వహణ చేపట్టాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు హెచ్చరించారు. గురువారం స్థానిక ఏఎంఏఎ హైస్కూలులో జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్య ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశానికి జిల్లా మొత్తం 120 మంది రావాల్సి ఉండగా, 65 మంది మాత్రమే హాజరు కావడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ గాడిలో పడిందని, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు గాడిలో పడలేదన్నారు. నిబంధనలు పాటించడం లేదన్నారు. పాఠశాలల్లో వసతులు, రక్షణ చర్యలు పరిశీలనకు ముగ్గురితో కూడిన కమిటీని వేసి పరిశీలనకు పంపుతామన్నారు. కమిటీ అన్ని పాఠశాలలను పూర్తి స్థాయిలో తనిఖీ చేసి నివేదిక ఇస్తుందని, వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రధానంగా వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతి పాఠశాలలో ఉండాలన్నారు. విద్యార్థులకు ఆటలు, క్రీడల్లో సాధన ఉండాలని సూచించారు. అసంపూర్తి నిర్మాణాలు, ప్రమాదకరంగా గోడలు, కిటికీలు లేకుండా చూసుకోవాలన్నారు. పిల్లల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలను విద్యార్థులకు రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ డీసీఈ బోర్డుకు బకాయిలన్నీ వెంటనే చెల్లించాలన్నారు. బోర్డు ద్వారా విడుదలవుతున్న పుస్తకాలు, పరీక్షపత్రాల నమూనాలను విద్యార్థులతో సాధన చేయించాలని తెలిపారు. జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్ ఎ.శ్రీధర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు విద్యార్థుల సమాచారంలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. నిబంధనల ప్రకారం వారి వివరాల నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచనలు చేశారు. డిప్యూటీ డీఈవో పొన్నాడ అప్పారావు, సీసీ వెంకటేశ్వరరావు ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘాల ప్రతినిధులు రాజు, సత్యనారాయణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా మంజూరు పత్రాలు అందజేత



బీమా మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రమాద వశాత్తు మృతి చెందిన జనసేన క్రియాశీల కార్యకర్తల కుటుంబాలకు బీమా మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అందజేశారు. ఈ మేరకు ఒక్కో కుటుంబానికి రూ.ఐదు లక్షలు చొప్పున 12 మందికి ఇక్కడి పార్టీ కార్యాలయంలో అందించారు. కష్టకాలంలో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఎల్ల ప్పుడూ అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మ్యాప్ పాయింటింగ్ పుస్తకాల పంపిణీ



కశింకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బయ్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాస రావు గురువారం మ్యాప్ పాయింటింగ్ పుస్తకాలు, ప్లాంక్‌లు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు జన్మదిన వారోత్సవాల్లో భాగంగా సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

దేవీపురంలో మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం



సబ్బవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని దేవీపురం సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి పీఠంలో గురువారం మార్గశిర మాసో త్సవాలు ప్రారంభమ య్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, లక్ష్మీ అష్టోత్తరంతో కుంకుమార్చన, మహాలక్ష్మీ హోమం, కమలాత్మిక హోమం వంటివాటిని వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో శ్రీవిద్య ట్రస్టు నిర్వాహకలు కందర్ప రమ, ప్రభాకర్‌లు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

- లంకెలపాలెం హైస్కూల్ మైదానంలో ఏర్పాట్లు పూర్తి
- స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ



పోటీలకు సిద్ధం చేసిన క్రీడా మైదానం

లంకెలపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పరవాడ మండలం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు అండర్-14 విభాగం బాల బాలికల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరగను న్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను పూర్తిచేసినట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కెఎం.నాయుడు తెలిపారు. గురువారం క్రీడా మైదానంలో సమావేశంలో మాట్లాడుతూ పోటీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి బాలుర, బాలికల విభాగాల్లో 26 జట్లు తలపడనున్నాయన్నారు. పోటీల్లో పాల్గొనే కీడాకారులు, పీడీలు, నిర్వహకులు మొత్తం 500 మందికి వసతి, భోజనం, అల్పాహారం ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. పోటీల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా కమిటీలను నియమించామన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి మోటూరి నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు, పీడీలు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ బలోపేతం

- ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ మిశ్రా



దరఖాస్తు చూపుతున్న మిశ్రా

అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ సుశాంత్‌మిశ్రా తెలిపారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బలోపేతంలో భాగంగా అన్ని మండలాలు, నియోజకవర్గాల్లో ఉన్న పార్టీ శ్రేణుల సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. అందరి అభిప్రాయాల మేరకు కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాబోయే స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తామన్నారు. దేశంలో ప్రధాని మోదీ, అమిత్‌షాలు అంబానీ, అదానీ కోసమే పనిచేస్తారే తప్ప దేశ ప్రజల కోసం పనిచేయడం లేదని ఎద్దేవా చేశారు. జిల్లా కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ మీసాల సుబ్బన్న, పీసీసీ పరిశీలకులు మేడా సురేష్, బోడా వెంకట్, మాడుగుల, పెందుర్తి, పాయకరావుపేట, నర్సీపట్నం అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు పడాల కొండలరావు, వినకోట రాము, మారుతి చక్రవర్తి, కె. చినబాబు, సీనియర్ నాయకులు కాళ్ల సత్యనారాయణ, బోయిన భానుమూర్తి యాదవ్, తుట్టా రమణ, కత్తెర శ్రీధర్, సేనాపతి రాజు, ఆర్‌ఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

గ్రామాల్లోని అవగాహన సదస్సుల్లో సీఐ స్వామినాయుడు



కొత్తపల్లి బుచ్చెయ్యపేటలో మాట్లాడుతున్న సీఐ స్వామినాయుడు

కశింకోట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సీఐ అల్లు స్వామినాయుడు సూచించారు. సెల్‌ఫోన్ల చోరీ.. వాటి వినియోగం ఏ విధంగా జరుగుతుంది అనే అంశంపై మండలంలోని కొత్తపల్లి బుచ్చెయ్యపేటలలో ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఎవరిదైనా ఫోన్ పోతే ఆయా వ్యక్తుల బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు ప్రశ్నార్థకమేనని పేర్కొన్నారు. అయ్యప్పమాలధారణ చేసిన భక్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తమ ఇళ్లకు తాళాలు వేయడమే కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, సంబంధిత పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అంతేకాకుండా సెల్‌ఫోన్‌లో నుంచి లావీదేవీలు చేయకుండా నగదును అపహరించినట్టు మెసేజ్ వస్తే వెంటనే 1930 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అనుమానాదవ్యక్తులు గ్రామాల్లో సంచరించినా పోలీసులకు సమాచారం తెలియజేయాలని వివరించారు. అనవసరమైన యాప్‌లను ఆపరేట్ చేయకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి



సదస్సులో ట్రైనీ ఎస్ఐ విజయకుమారి, తదితరులు

పరవాడ : ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని పరవాడ ట్రైనీ ఎస్ఐ విజయకుమారి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాల, చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని వివరించారు. డ్రగ్స్ వద్దు బ్రో అని ప్రతి విద్యార్థి సమాజానికి మెసేజ్ ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబు, అధ్యాపకులు సాంబశివరావు, లక్ష్మీకుమారి, ఉషాకుమారి, గణేష్, కళ్యాణి, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రింగు రోడ్డులో చెట్ల కొమ్మలు తొలగింపు



చెట్లను దగ్గరుండి తొలగింపు చేస్తున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రింగురోడ్డులో విద్యుద్దీపాల వెలుగులకు అడ్డంకిగా మారిన పలు చెట్లు, కొమ్మలను జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి గురువారం ఉద్యానశాఖ వర్కర్స్‌తో కలిసి తొలగించేలా చర్యలు చేపట్టారు. రైల్వే స్టేషన్ నుంచి దారి పొడవున అనకాపల్లి మెయిన్‌రోడ్డు వరకు డివైడర్ల మధ్యలో ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ చెట్లు విద్యుత్ స్తంభాల కంటే ఎత్తుగా పెరగడంతో పాటు వెలుతురు రోడ్డుపై పడకుండా అడ్డుగా ఉన్నాయి. దీనికితోడు కోనోకార్పస్ చెట్లు కూడా ఉన్నాయి. ఈ చలికాలంలో కోనో కార్పస్ చెట్లు వల్ల ఆస్తమా, దగ్గు, అలర్జీస్ వస్తాయని జడ్సీ తెలిపారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు కోనో కార్పస్ చెట్లను కూడా తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన విభాగం అధికారిణి ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ పోలిరెడ్డిపాలెంలో గల సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తిక్కవానిపాలెం, దలాయిపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, దోసూరు, ముత్యాలమ్మపాలెం, ఊటగెడ్డపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులంతా గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు

కశింకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కన్నూరుపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి టీడీపీ మండల అధ్య క్షుడు గొంతిన శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరిజన కాలనీ నుంచి వైఎస్సార్ కాలనీ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.45లక్షలు మంజూరైనట్టు చెప్పారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి తదితరులు

జాతీయస్థాయి ఆటల పోటీలకు వివిధ పాఠశాలల విద్యార్థులు ఎంపిక

పరవాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది జనవరిలో వారణాసి, జార్ఖండ్, మణిపూర్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో నిర్వహించనున్న జాతీయస్థాయి బాక్సింగ్, స్విమ్మింగ్, షూటింగ్, సాఫ్ట్ బాల్ పోటీలకు మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన 17 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు తెలిపారు. సదరు విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, సిబ్బంది అభినందించారు.



సబ్బవరం జాతీయ టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కేశవరావు తదితరులు

సబ్బవరం : శ్రీకాకుళం జిల్లా పలాసలో ఇటీవల జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ టెన్నీకాయిట్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని స్థానిక అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు తెలిపారు. దీంతో వచ్చే నెల 21 నుంచి 24 వరకు కేరళలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులతో పాటు వీరిని తీర్చిదిద్దిన పీడీలు విపసూర్యనారాయణ, ప్రసాద్‌లను ప్రిన్సిపాల్ కేశవరావు, జిల్లా టెన్నీకాయిట్ ప్రధాన కార్యదర్శి జి.కనకారావు, రాష్ట్ర టెన్నీకాయిట్ ప్రధాన కార్యదర్శి కేఎస్‌వీ సత్యనారాయణ అభినందించారు.



తుమ్మపాల పాఠశాల నుంచి ఆడనున్న విద్యార్థిని

తుమ్మపాల : జాతీయస్థాయి అండర్-17 ఖోఖో పోటీలకు తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గొర్లి నవ్య ఎంపికైంది. దీంతో వచ్చే నెల డిసెంబరులో అయోధ్యలో జరగనున్న పోటీల్లో తలపడనుంది. ఈ సందర్భంగా ఆమెను ప్రిన్సిపాల్ ఎస్.శంకరరావు, పీడీ పీలా వీరునాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరాం, గ్రామ పెద్దలు అభినందించారు.

బాలాలయంలోకి నూకాలమ్మ ఆవాహనం

నర్సీపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నూకాలమ్మ ఆలయం పునఃనిర్మా ణం జరుగుతున్న నేపథ్యంలో గురువారం బాలాలయంలోకి నూకాలమ్మను ఆవాహనం చేశారు. వేద పండితులు రేజేటి సీతారామాచార్యుల బృందం ఆధ్వర్యంలో పూర్వపు ఆలయంలోని అమ్మవారిని బాలాలయంలో కలశ స్థాపన చేసి ఆవాహన చేశారు.

CHANGE OF NAME

I, BODA NAGA VISHALA MANKYA KARUMARI SANTHOSHI GUPTA (Old name) S/o. Naga Venkata Jagannadh Rao Boda, R/o. D.No. 15-153, 1st line, NGO'S Colony, Anakapalli-531001, A.P. Changing my name from BODA NAGA VISHALA MANKYA KARUMARI SANTHOSHI GUPTA (Old name) to BODA NAGA VENKATA MANIKYA KARUMARI SANTOSH GUPTA (New Name). Henceforth I am being called as BODA NAGA VENKATA MANIKYA KARUMARI SANTOSH GUPTA (New Name) S/o. Naga Venkata Jagannadh Rao Boda, for all purposes.

రైతు సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

» టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి


మాట్లాడుతున్న టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని కుజ్జెలి పంచాయతీ ఎగువ మోదాపుట్టు గ్రామంలో గురువారం రైతన్నమీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం వల్ల రాష్ట్రం అప్పుల్లో ఉన్నా, ఈ స్థితిని అధిగమించి రైతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని విజయవంతంగా అమలు చేశారన్నారు. ఏడాదికి రూ. 20 వేలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతో కలిపి పెట్టుబడి సాయంగా అందిస్తున్నామన్నారు. అందులో భాగంగా మొదటి రెండు విడతలు నిధులు రైతులకు జమచేసినట్టు చెప్పారు. రైతులు అధిక దిగుబడులు సాధించాలని, ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేపట్టాలని చంద్రన్న రైతన్న మీకోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బొర్రా విజరాణి, టీ డీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ డప్పోడి వెంకటరమణ, టీడీపీ నాయకులు ఎల్.పార్వతమ్మ, కుమారి, డిప్పల వెంకట కు మారి, బి.జ్యోతికిరణ్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వనుగుపల్లి పంచాయతీలో .....

వనుగుపల్లి పంచాయతీ బంధపొలం, కరకపుట్టు గ్రామంలో టీడీపీ నాయకులు రైతన్న మీకోసం కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఆర్గానిక్ పంటలతో వచ్చే దిగుబడులు, ఆర్థిక లాభాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రేగం భానుమతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు డుంబేరి రమణబాబు, వనుగుపల్లి సర్పంచ్ ముివ్వల మీనా, ఉపసర్పంచ్ సింహాచలం, వార్డు సభ్యులు ఎం.కొండబాబు, డి.సత్తిబాబు, ఏవో, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

వాల్యూ ఎడ్యుకేషన్ ఒలింపియాడ్‌లో సత్తాచాటిన ఏకలవ్య విద్యార్థి

» జాతీయ స్థాయిలో 3వ స్థానం, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం


విద్యార్థి గౌతమ్

పెదబయలు నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఒలింపియాడ్ పోటీల్లో స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థి కొర్ర గౌతమ్ సత్తా చాటినట్టు ప్రిన్సిపాల్ అమీత్‌కుమార్ ఆనంద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల దేశ వ్యాప్తంగా ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు జాతీయ స్థాయి వాల్యూ ఎడ్యుకేషన్ ఒలింపియాడ్- 2025 పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. పోటీల్లో ఏకలవ్య పాఠశాల్లోని 12 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. తమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కొర్ర గౌతమ్ జాతీయ స్థానంలో 3వ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. గౌతమ్ త్వరలో న్యూ ఢిల్లీలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌నుంచి బహుమతి అందుకోనున్నట్టు పేర్కొన్నారు. ఈ విద్యార్థిని ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

మాక్ అసెంబ్లీలో గురుకుల విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది

కొయ్యూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం పురస్కరించి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో మండలానికి చెందిన గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి సతివాడ హేమంత్ సాయి జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి ఐటీడీఏ పీవోను ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ నరశింహమూర్తితో పాటు వైస్ ప్రిన్సిపాల్ శంఖర్, తదితర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు


నూతన బ్రేకర్ల ఏర్పాటు పనులను పర్యవేక్షిస్తున్న డీఈఈ వేణుగోపాల్

ముంచంగిపుట్టు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయాలు లేకుండా, నిరంతర సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్టు విద్యుత్ శాఖ డీఈఈ వేణుగోపాల్ అన్నారు.స్థానిక సబ్ స్టేషన్‌లో మండల కేంద్రంతో పాటు పెదగూడ, మాకవరం, ఫబుడర్లకు చెందిన మూడు కొత్త బ్రేకర్లను గురువారం ఏర్పాటు పనులు పూర్తి చేశారు. ఆ పనులను డీఈఈ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఫీడర్ల ఏర్పాటుతో మారుమూల గ్రామాలకు విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. లో వోల్టేజీ సమస్య ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ ప్రసాద్, ఏఈఈ సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమసిన పాఠశాల భవన నిర్మాణ వివాదం

అనంతగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లి పంచాయతీ గాదిల్లోవ గ్రామంలోని రెండు వీధులకు సంబంధించి నెలకొన్న వివాదం పాఠశాల నిర్మాణానికి అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో గురువారం జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, ఎంఈవో కిల్లో బాలాజీ, ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ కలిసి ఆ గ్రామానికివెళ్లారు. అనంతరం జడ్పీటీసీ గంగరాజు గిరిజనులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల భవన నిర్మాణానికి సుమారు రూ.16 లక్షల మంజూరైందని, రెండు వీధుల గిరిజనులు గొడవలు పడితే ఈ నిర్మాణం నిలిచిపోతుందని వివరించారు. 30 మంది విద్యార్థులకు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, తల్లిదండ్రులు మంచి మనస్సుతో పాఠశాల భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. దీంతో రెండు వీధుల మధ్యలోని పాఠశాల నిర్మించేలా గిరిజనులను ఒప్పించారు. ఈ కార్యక్రమంలోని సీపీఎం నాయకుడు దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా రెడ్ క్రాస్ సేవలు: కలెక్టర్


నూతన అంబులెన్స్ ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరురూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాడేరు పరిధిలో సేవలను విస్తృత పరిచేందుకు వీలుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అంబులెన్స్ కొనుగోలు చేసింది. ఆ వాహనాన్ని గురువారం కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ, అసిస్టెంట్ కలెక్టర్ కె.చిరంజీవి నాగవెంకట సాహిత్‌లు కలిసి కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం విస్తృతంగా పనిచేస్తోందని, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సొసైటీకి సహకరించాలని సూచించారు. ఎంపీడీవోలు, తహశీల్దార్లు, మండల విద్యాశాఖాధికారులు బృందంగా ఏర్పాటు చేసి విరివిగా రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్త వాహనం పాడేరు డివిజన్‌కు,పాత వాహనాన్ని చింతూరుకి కేటాయిస్తామన్నారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరా వు, సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, సొసైటీ ప్రతినిధులు సూర్యారావు, టి.ప్రసాద్ నాయుడు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు'



ఐటీడీఏ వద్ద నిరసన చేపట్టిన యూటీఎఫ్ నాయకులు

పాడేరురూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు బోధనేతర పనులను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.మహేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉపాధ్యాయులు గురువారం ఐటీడీఏ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులు రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకు విధులు నిర్వహించాలని, ఉదయం 6 గంటలకు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని, ఉపాధ్యాయులు రాత్రి బస చేయాలని ఆదేశించారన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి ఉపాధ్యాయుడిని ఏకపక్షంగా బాధ్యుడిని చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. డైరెక్టర్ ఇచ్చిన ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు టి.చిట్టిబాబు, ఎం.ధర్మారావు, పి.దేముడు, ఎస్.కన్నయ్య, కె.రఘునాథ్, సీహెచ్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

» జీసీసీ రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్


ప్రజాదర్బారులో వినతులు స్వీకరిస్తున్న శ్రావణ్ కుమార్

పాడేరురూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని జీసీసీ రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం ఆయన పాడేరులోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తెలుసుకున్నారు. హుకుంపేట మండలం సంతారి, బొడ్డాపుట్టు పంచాయతీలు, ముంచంగిపుట్టు మండలం దారెల, కిలగాడ, వనబసింగి, జోలాపుట్టు పంచాయతీలలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. దారెల పంచాయతీలో గన్నెడ, వనబసింగి, టొంగికోట, తలింబ వరకు బీటీరోడ్డు వేయాలని, హుకుంపేటలో రైతుల కోసం పంట దినుసుల నిల్వ కేంద్ర భవనం నిర్మాణానికి సహకరించాలని కోరారు. తాజంగి కేజీబీవీలో లైబ్రరీ పోస్టు భర్తీ చేయాలని, ఏఎన్ఎం వేతనాలు పెంచాలని, సంతారిలో స్కూల్ మార్గంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, అనంతగిరి మండలం గరుగుబిల్లి వద్ద వంతెన నిర్మాణం తదితర సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి

పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలపై ఉపాధ్యాయ సంఘ నాయకులు శ్రావణ్ కుమార్‌కు వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.వెంకటరమణ, పి.పాండురంగస్వామి, శశిభూషణ్ నాయుడు, సుబ్బారావు, జగత్, లక్ష్మణ్, వాసుదేవ్, కొమ్మరమ్మ కళావతి, నిర్మల, బుజ్జిబాబు పాల్గొన్నారు.

రెడ్ రిబ్బన్ క్లబ్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరణలో డిగ్రీకళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

పాడేరురూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలో పాడేరు రెడ్ రిబ్బన్ క్లబ్(ఆర్ఆర్‌సీ)ఆధ్వర్యంలో పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎస్.రసూల్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహన, బాధ్యతా యుతమైన ప్రవర్తన యువతలో చాలా అవసరమన్నారు. హెచ్ఐవీ వ్యాప్తి నిరోధానికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంలో రెడ్ రిబ్బన్ క్లబ్ పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. హెచ్ఐవీ నివారణ-యువత బాధ్యత అనే అంశంపై సృజనాత్మకంగా పోస్టర్ తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్‌సీ కో- ఆర్డినేటర్ జి.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు సాగితే బంగారు భవిష్యత్తు: ఐటీడీఏ పీవో


పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో శ్రీపూజ

హుకుంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి); ప్రతి విద్యార్థీ ఉన్నత స్థాయి ఉద్యోగస్థులు కావాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగితే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఐటీడీఏ పీవో తిరుమాని శ్రీపూజ తెలిపారు గురువారం మండలంలోని సూకురు గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా వంట గది , జీసీసీ అందిస్తున్న సరుకులు స్టాక్‌రూమ్ పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత, పిల్లలకు తాగేందుకు వేడి నీరు సమకూర్చడంపై సంతృప్తి వ్యక్తంచేశారు. తరగతి గదులకు వెళ్లి తనిఖీ చేశారు. పదో తరగతిలో విద్యార్థుల మధ్య కూర్చుని పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయ పాలనపాటించాలని కోరారు. పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని తెలిపారు. మిగిలి తరగతి పిల్లలకు చిన్ననాటినుంచి మంచి బోధనను అందిస్తే పోటీ పరీక్షల్లో విజయం సాధించే అవకాశం ఉంటుందన్నారు. రాత్రి 9 గంటలు వరకు స్టడీ అవర్స్ ఏర్పాటు చేస్తే.. వారు ఆరుబయట తిరిగేందుకు వీలుకాకుండా ఉంటుందన్నారు. ప్రభుత్వ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిసెంబరు ఒకటి నుంచి పులుల గణన:డీఎఫ్‌వో


సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో వైవీ నరసింహరావు

చింతపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో అడవి జంతువులు, పులుల వివరాల సేకరణను డిసెంబరు ఒకటి నుంచి ప్రారంభించనున్నట్టు స్థానిక డీఎఫ్‌వో వైవీ నరసింహరావు తెలిపారు. గురువారం మండలంలోని కృష్ణాపురం ఎకో టూరిజం ప్రాజెక్టులో పులుల గణనపై డివిజన్ పరిధి అటవీశాఖ ఉద్యోగులకు ఒక్కరోజు వర్కుషాపు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎఫ్‌వో మాట్లాడుతూ నాలుగేళ్లకు ఒకసారి అఖిల భారత పులుల గణన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ నేపథ్యంలో డిసెంబరు ఎనిమిది వరకు అటవీశాఖ ఉద్యోగులు అడవిలో సర్వే చేస్తారన్నారు. ప్రధానంగా మొదటి మూడు రోజులు మాంసాహార జంతువులు, ఆఖరి మూడు రోజులు శాకాహార జంతువులపై సర్వే చేపడతామన్నారు. పులులు, అడవి దున్న, ఇతర జంతువుల వివరాలను సేకరిస్తామన్నారు. ఉద్యోగులు సమర్థవంతంగా పక్కాగా సర్వే చేయాలన్నారు. అనంతరం ఫీల్డ్‌లో సర్వేపై డీఎఫ్‌వో అటవీశాఖ ఉద్యోగులకు వివరించారు. ఈకార్యక్రమంలో డివిజన్ పరిధి రేంజ్ అధికారులు బి.అప్పారావు, జె. ప్రశాంతి కుమారి, ఎస్. వెంకటరావు, సీహెచ్. సింహాచలం, ఉద్యోగులు పాల్గొన్నారు

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ బిల్లులు ఆదా


సోలార్ వినియోగంపై ర్యాలీ చేపడుతున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది

పెదబయలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు, విద్యుత్ బిల్లుల ఆదాకు సౌర విద్యుత్ దోహదమవుతుందని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఈఈ పి. వేణుగోపాల్ సూచించారు. ఈ మేరకు పెదబయలు మండల కేం ద్రంలో ఆ శాఖ అధికారులు, సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి స్టేట్ బ్యాంక్ వరకు పుర వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా ఒక్క సారి పెట్టుబడితో సోలార్ పరికరాలు ఏర్పాటు చేసుకుంటే 20 ఏళ్ల వరకు గృహ విద్యుత్ వాడుకోవచ్చన్నారు. అదనపు విద్యుత్ ఉత్పత్తి చేస్తే తమ సంస్థకు విక్రయించి ఆదాయాన్ని సంపాదించవచ్చునని అన్నారు.ఈ సోలార్ ప్యానల్స్‌ను ఇంటి రూఫ్‌టాప్‌పై ఏర్పాటుకు సబ్సిడీపై పలు బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలను అందిస్తున్నాయన్నారు. ఆసక్తి గల వినియోగదారులు పీఎం సూర్య ఘర్ పథకం కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ ఎల్.బి. ప్రసాద్, ఏఈఈ బి. సురేష్, జేఈ జి. రాంబాబు, ఎల్ఐ జే. అప్పలరాజు, ఎల్ఎం పి. సోమేష్‌కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల సంఖ్య ఆధారంగా అదనపు పోలింగ్ కేంద్రాలు

గూడెంకొత్తవీధి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓటర్ల సంఖ్య ఆధారంగా అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తహసీల్దార్ అన్నాజీరావు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో బీఎల్‌వోలు, వివిధ పార్టీల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 1200పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను విభజించాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీచేసిందన్నారు. ఈ మేరకు అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుకు చర్యలు ప్రారంభించామన్నారు. పోలింగ్ కేంద్రాల విభజనపై వివిధ పార్టీల నాయకులు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజరాబు, బీజేపీ నాయకుడు బొండ్ల చిరంజీవి, దేవరాపల్లి సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవో గుత్తులపుట్టు ఆశ్రమ పాఠశాల సందర్శన


విద్యార్థి పఠనాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో టి.శ్రీపూజ

పాడేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో గుత్తులపుట్టులోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం సాయంత్రం ఐటీడీఏ పీవో శ్రీపూజ సందర్శించారు. అక్కడ సూపర్- 50 పేరిట టెన్త్ విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక బోధనను ఆమె పరిశీలించి, పలు అంశాలపై విద్యార్థులను ఆరా తీశారు. అలాగే విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను పక్కాగా కల్పించాలని, ఈక్రమంలో ఎటువంటి అవసరాలు, ఇబ్బందులున్నా తనకు తెలపాలని ఐటీడీఏ పీవో సూచించారు. ఈసందర్భంగా స్టాక్ రూమ్‌లోని సరకులను ఆమె పరిశీలించారు.

సీలేరులో నేడు మెగా వైద్య శిబిరం

సీలేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మైత్రీమూవీ మేకర్స్, అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సీలేరులో ఈ నెల 28న నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని స్థానిక ఎస్ఐ యాసీన్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా గురువారం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ సీలేరు రామాలయం సెంటర్‌లో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు.. ఈ మేరకు గ్రామాల్లో పోస్టర్లు, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈవైద్య శిబిరానికి డెంటల్, ఆప్తమాలజీ, గైనకాలజిస్ట్, జనరల్ ఫిజిషియన్ వైద్యనిపుణులు వస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

చింతపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పాడేరు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వెణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతపల్లి 33 కేవీ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతులు పనులు నిర్వహించనున్నామన్నారు. ఈ మేరకు ఆ రోజు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రెండు మాడలాల్లోని ప్రతి గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


శిలంగొందిలో రైతన్నా మీకోసంలో కూటమి శ్రేణులు

డుంబ్రిగుడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా పోతంగి పంచాయతీ శీలంగొవది గ్రామంలో గురువారం పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భీమరాజు, ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ పథకాల సంబంధిత బ్రోచర్లను చూపిస్తు ప్రభుత్వ ఆశయాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దన్నేరావు, పీఏసీఎస్ మాజీ అధ్య క్షుడు బాస్కరరావు, రైతులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో విస్తృతంగా రైతన్న మీ కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఏవో సునీల్ తెలిపారు. గురువారం బొంగడారి, చిత్రాయిపుట్టు, సుంద్రుపుట్టు, గొంది కోడపుట్టు గ్రామాల్లో సందర్శించి రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశాలు వినిపించారు. పీఎం కిషన్, అన్నదాత సుఖీభవ పథకాలు పొందని అర్హుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వ్యవసాయ శాఖ,ఉద్యాన శాఖ, పశుసంవర్ధ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి : ఏటీడబ్ల్యూవో


విద్యార్థులతోమాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి

గూడెంకొత్తవీధి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో బాల్యవివాహాలను శతశాతం నిర్మూలించాలని ఏటీడబ్ల్యూవో బి. జయనాగలక్ష్మి అన్నారు. గురువారం వాసవ్య మహిళా మండలి వంద రోజుల ప్రణాళికలో భాగంగా కొత్తపాలెం, కృష్ణాపురం, వంగసార పాఠశాలల్లో బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఏటీడబ్ల్యూవో మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులు, విద్యార్థులు చైతన్యవంతులు కావాలన్నారు. వివాహ వయస్సు వచ్చే వరకు ఎవరు పెళ్లి చేసుకోరాదన్నారు. తల్లిదండ్రులు బలవంతం చేసినా తిరస్కరించాలన్నారు. అవరమైతే అంగన్‌వాడీ కార్యకర్త, మహిళా కానిస్టేబుల్‌ని సంప్రదించాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు కోఆర్డినేటర్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం పలాసి ప్రసాదరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఎగువ సీలేరు పంప్డ్ స్టోరేజీకి పర్యావరణ, అటవీశాఖ అనుమతులు

గూడెంకొత్తవీధి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎగువ సీలేరు పంప్డ్ స్టోరేజీకి పర్యావరణ, అటవీశాఖ అనుమతులు మంజూరైనట్టు స్థానిక తహసీల్దార్ అన్నాజీరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ. ఎగువ సీలేరువలసగెడ్డ, బుసుకొండ గ్రామాల్లో ఏపీజెన్‌కో 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ నిర్మించనున్నదన్నారు. ఈ స్టోరేజీ నిర్మాణాలకు అవసరమైన పర్యావరణ, అటవీ అనుమతులను పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ (ఎంవోఈఎఫ్, సీసీ) మంజూరు చేసిందన్నారు. ఈ పర్యావరణ అనుమతులను ప్రాంతీయ ప్రభుత్వ కార్యాలయాల్లో పదర్శిస్తామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికపై సన్మానం


విద్యార్థిని, ఉపాధ్యాయుడికి సన్మానం

జి.మాడుగుల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుర్మతి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పాంగి కళ్యాణి జాతీయ స్థాయి జావెలిన్‌త్రోలో ఎంపికైన సందర్భంగా గురువారం విద్యార్థినితో పాటు పీడీ మురళీనాయుడుని ఘనంగా సన్మానించారు. ఇటీవల రాష్ట్ర స్థాయి అండర్-17 అథ్లెటిక్స్ పోటీలో రెండవ స్థానం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో డిసెంబరు 10న యూపీలో జాతీయ స్థాయి జావెలిన్‌త్రోలో పాల్గొనుంది. హెచ్ఎం. శివలింగం, డిప్యూటీ వార్డెన్ పి.రాజేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన


సీ కాలనీలోని శంకుస్థాపన చేస్తున్న పెదలబుడు సర్పంచ్

అరకులోయ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదలబుడు పంచాయతీ సీ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.8 లక్షలతో 100 మీటర్ల డ్రైనేజీ పనులకు గురువారం సర్పంచ్ పి.దాస్‌బాబు, నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి పంచాయతీ నిధులు కేటాయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చందు, వార్డుమెంబర్ త్రినాథ్, పెదలబుడు-1 ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, వార్డు మెంబర్లు నాగరాజు, అమ్మలు, టీడీపీ నేత గౌరీ, జనసేన నాయకుడు చెట్టి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గుల వితరణ


వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న తెలుగు యువత నేత

పాడేరురూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మన్యంలో చలితీవ్రతను దృష్టిలో పెట్టుకొని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ గురువారం గబ్బంగి పంచాయతీ నేరేడివలసలో వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా గబ్బంగి పంచాయతీలోని వివిధ గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను వివరించారు. ఈ క్రమంలో వృద్ధులకు రక్షణ కల్పించాలన్న ధ్యేయంతో ఉన్ని రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జీలు తామర మూర్తిబాబు, కొంతెలి వెంకటప్రసాద్, వంతాల చిట్టిబాబు, వార్డు స భ్యుడు సత్తిబాబు, వీవోఏ ఈశ్వరి కుమారి పాల్గొన్నారు.

బాలాలయంలోకి
నూకాలమ్మ ఆవాహనం


నూకాలమ్మకు పూజలు చేస్తున్న పద్మావతి

నర్సీపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నూకాలమ్మ ఆలయం పునఃనిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో గురువారం బాలాలయంలోకి నూకాలమ్మను ఆవాహనం చేశారు. వేద పండితులు రేజేటి సీతారామాచార్యుల బృందం ఆధ్వర్యంలో పూర్వపు ఆలయంలోని అమ్మవారిని బాలాలయంలో కలశ స్థాపన చేసి ఆవాహన చేశారు. 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పదేళ్లుగా నిలిచి పోయిన నూకాలమ్మ ఆలయ నిర్మాణ పనులు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆలయ నిర్మాణానికి అయ్యన్న కుటుంబ సభ్యులు మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.10 లక్షలు విరాళం ఇవ్వగా, ప్రభుత్వం రూ.40 లక్షలు నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. మొత్తం రూ.50 లక్షలతో పనులు ప్రారంభించినట్టు చెప్పారు. గత ఐదేళ్లుగా పనులు నిలిచి పోవడం జరిగిందని తెలిపారు. ఆలయ నిర్మాణానికి నిధులు సరిపోక పోవడంతో అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులు మ్యాచింగ్ గ్రాంట్ కోసం మరో రూ.10 లక్షలు విరాళం ఇచ్చారన్నారు. దీంతో ప్రభుత్వం మరో రూ.40 లక్షలు నిధులు మంజూరు చేసిందని వివరించారు. నూకాలమ్మ ఆలయ నిర్మాణ పనులు పనులు వేగంగా జరుగుతున్నాయని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొరుప్రోలు శ్రీనివాసరావు, ఈవో సాంబశివరాలు పాల్గొన్నారు.

'ప్రైవేటు పాఠశాలల పర్యవేక్షణకు కమిటీ'

కొత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, నిర్వాహకులు నిబంధనల ప్రకారం ఆయా పాఠశాలల నిర్వహణ చేపట్టాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు హెచ్చరించారు. గురువారం స్థానిక ఏఎంఏఎల్ హైస్కూలులో జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్య ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశానికి జిల్లా మొత్తం 120 మంది రావాల్సి ఉండగా, 65 మంది మాత్రమే హాజరు కావడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ గాడిలో పడిందని, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు గాడిలో పడలేదన్నారు. నిబంధనలు పాటించడం లేదన్నారు. పాఠశాలల్లో వసతులు, రక్షణ చర్యలు పరిశీలనకు ముగ్గురితో కూడిన కమిటీని వేసి పరిశీలనకు పంపుతామన్నారు. కమిటీ అన్ని పాఠశాలలను పూర్తి స్థాయిలో తనిఖీ చేసి నివేదిక ఇస్తుందని, వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రధానంగా వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతి పాఠశాలలో ఉండాలన్నారు. విద్యార్థులకు ఆటలు, క్రీడల్లో సాధన ఉండాలని సూచించారు. అసంపూర్తి నిర్మాణాలు, ప్రమాదకరంగా గోడలు, కిటికీలు లేకుండా చూసుకోవాలన్నారు. పిల్లల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలను విద్యార్థులకు రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ డీసీఈ బోర్డుకు బకాయిలన్నీ వెంటనే చెల్లించాలన్నారు. బోర్డు ద్వారా విడుదలవుతున్న పుస్తకాలు, పరీక్షపత్రాల నమూనాలను విద్యార్థులతో సాధన చేయించాలని తెలిపారు. జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్ ఎ.శ్రీధర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు విద్యార్థుల సమాచారంలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. నిబంధనల ప్రకారం వారి వివరాల నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచనలు చేశారు. డిప్యూటీ డీఈవో పొన్నాడ అప్పారావు, సీసీ వెంకటేశ్వరరావు ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘాల ప్రతినిధులు రాజు, సత్యనారాయణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాచపల్లిలో ప్రశాంతంగా గ్రామ సభ

» 406.87ఎకరాల్లో 489 మంది రైతులు గుర్తింపు



అర్హుల జాబితాను విడుదల చేస్తున్న ఆర్‌డీవో, అంతర్ చిత్రం పాల్గొన్న గ్రామస్థులు



మాకవరపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచపల్లి రెవెన్యూ 737 సర్వే నంబరులో తీసుకుంటున్న కొండపోరంబోకు భూమికి నిర్వహించిన గ్రామ సభను రైతులు ఏకగ్రీవంగా ఆమోదించారు. గురువారం రాచపల్లి రామాలయం వద్ద సర్పంచ్ రుత్తల సీతారాముడు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. అయితే గ్రామ సభలో ఎటువంటి అవాంతరాలు జరగకుండా ముందుస్తుగా స్థానిక ఎస్ఐ దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ఆర్‌డీవో వి.వి.రమణ మాట్లాడుతూ 737 సర్వే నంబరులో ఉన్న కొండపోరంబోకు భూమి సాగులో ఉందన్నారు. రైతుల వద్ద నుంచి ప్రభుత్వం భూమిని తీసుకుంటుందని నాలుగు నెలలు కిందట ప్రభుత్వం ప్రకటన చేసిందన్నారు. ఈ నేపథ్యంలోనే రెండు నెలలు పాటు సర్వే నిర్వహించి 406ఎకరాల భూమిని గుర్తించామన్నారు. అయితే భూములు విస్తీర్ణాలు తక్కువ వచ్చాయని సుమారు 30మంది రైతులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే నర్సీపట్నం తహశీల్దార్ లోకవరపు రామరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సర్వే చేశామన్నారు. అభ్యంతరాలు పూర్తయిన తర్వాత గ్రామసభ తేదీ ఖరారు చేసి సభ నిర్వహించామన్నారు. ఇందులో భాగంగానే 406.87ఎకరాల్లో 489 మంది రైతులు సాగులో ఉన్నట్టు గుర్తించామని వివరించారు. ప్రభుత్వం ఈ భూమికి సరైన ప్యాకేజీ ఇస్తుందన్నారు. అలాగే భూమి కోల్పోయిన వారి కుటుంబాల్లో వారికే స్థానికంగా ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఇది అందరికీ ఆమోదం అయితే తెలియజేయాలని ఆర్‌డీవో చెప్పగా జి.కోడూరు రైతు రమణ మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీకి తీసుకున్న భూమిలకు ఇచ్చిన పరిహారం ఈ భూములకు అందజేయాలన్నారు.అలాగే టీడీపీ ఎంపీటీసీ రుత్తల యర్రాపాత్రుడు మాట్లాడుతూ ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతోనే ఇక్కడ భూములను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. మరో టీడీపీ నాయకుడు జోగిపాత్రుడు మాట్లాడుతూ ఎన్నోఏళ్ల నుంచి సాగుచేసుకుంటున్న భూమికి సరైన ప్యాకేజి ఇచ్చి రైతులను సంతోష పెట్టాలన్నారు. మీ సమస్యలను ఉన్నాతాధికారులకు తెలియజేస్తామని ఆర్‌డీవో తెలిపారు. అనంతరం భూములు తీసుకోవడం మంచిదని రైతులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం రైతుల జాబితాలను విడుదల చేసి సచివాలయంలో వేలాడదీశారు. దీంతో గ్రామ సభ ముగించి అధికారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు రామరావు, వెంకరమణ, జెడ్‌పీటీసీ పెట్ల సత్యవేణి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, టీడీపీ నాయకులు, జోగిపాత్రుడు, అల్లు రామునాయుడు, నందకిశోర్,జమీందార్ పాల్గొన్నారు.

రుణ వాయిదాలు సకాలంలో చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీడీ డైసీ

గొలుగొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల వాయిదాలు సకాలంలో చెల్లించాలని డీఆర్‌డీ ఏపీడీ డైసీ తెలిపారు. పప్పుశెట్టిపాలెం గ్రామంలో వివిధ రకాలైన రుణాల రికవరీ చెల్లింపులు నిలిచిపోవడంతో గురువారం డ్వాక్రా సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పప్పుశెట్టిపాలెం గ్రామంలో స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల రుణాలు వాయిదాలు చెల్లించకపోవడంతో డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఒక సంఘానికి సంబంధించి పూర్తిగా వాయిదాలు తిరిగి చెల్లింపులు లేకపోవడంతో గ్రామంలోనే గొలుగొండ ఎస్‌బీఐ బ్రాంచ్ సిబ్బంది మిగిలిన గ్రూపులకు రుణాల మంజూరు రెండేళ్లుగా నిపివేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. డ్వాక్రా సంఘాల సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో దళిత, గిరిజన స్వయం సహాయక సభ్యులకు 4400 మందికి ఉన్నతి రుణాలకు వడ్డీలేని రుణాలకు అర్హులుగా గుర్తించామన్నారు. 2024- 2025 ఏడాదకిగాను స్త్రీనిధి నుంచి 159 కోట్ల రూపాయలు రుణాలు అందించామన్నారు. డ్వాక్రా సంఘాలు రుణాల మంజూరులో ఎవరికీ ఎటువంటి నగదు చెల్లించాల్సిన పనిలేదన్నారు. గిరిజనల, దళితల సభ్యులకు ఉన్నతి రుణాలు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు లింకేజ్ ఏజీఎం కుమారస్వామి,స్త్రీనిధి ఏజీఎం సాదిక్, మేనేజర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సీఐగా ఎస్‌కే గఫూర్

సీఐ గోవిందరావు డీఐజీ ఆఫీసుకి బదిలీ

నర్సీపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ సీఐగా ఎస్‌కే గఫూర్‌ను డీఐజీ నియమించారు. నర్సీపట్నం సీఐగా పని చేస్తున్న జి.గోవిందరావును విశాఖపట్నం రేంజ్ కార్యాలయానికి బదిలీ చేసి వీఆర్‌లో పెట్టారు. ఈయన స్థానంలో అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న ఎస్‌కే గఫూర్‌ను ఇక్కడ పట్టణ సీఐగా బదిలీ చేశారు.

మైదానంలో మంచు సోయగం


మాకవరపాలెంలో మంచుపడుతున్న దృశ్యం

మాకవరపాలెం, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : మైదాన ప్రాంతంలో మంచు దట్టంగా కురుస్తోంది. మాకవరపాలెంతో పాటు కొండలఅగ్రహారం, తామరం, రాచపల్లి గ్రామాల్లో గురువారం ఉదయం తొమ్మిది గంటలైనా సూర్యుని జాడ కనిపించలేదు. దట్టమైన పొగమంచు ఈ ప్రాంతాన్ని పూర్తిగా కమ్మేయడంతో ఉదయం వేళ కూడా సాయంతాన్ని తలపిస్తోంది. ప్రదాన రహదారులపై పొగమంచు కురవడంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పగటి వేళలో సైతం లైట్లు వెలుగులో వాహన రాకపోకలు సాగిస్తున్నాయి.

పింఛన్ల పునరుద్ధరణకు వినతి


ఎంపీడీవోకు సమస్యను వివరిస్తున్న మణికుమారి,

గొలుగొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పాకలపాడు పంచాయతీ శివారు వెంకట్రాపురం గ్రామంలో నిలిపివేసిన పింఛన్లు పునఃరుద్ధరించాలని ఎంపీపీ గజ్జలపు మణికుమారి, బాధితులు ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. ఈ సదర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అర్హులైనప్పటికీ అనేక మంది పింఛన్లు కూటమి ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. సదరు పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని ఎంపీడీవో శ్రీనివాసరావును కోరారు. దీనిపై ఎంపీడీవో స్పందించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాపురం గ్రామానికి చెందిన బాధితులు పాల్గొన్నారు.

డైట్ లెక్చరర్స్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల సందర్శన

కె.కోటపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భీమునిపట్నం డైట్ (జిల్లా విద్యా శిక్షణ పరిశోధన సంస్థ) సీనియర్ లెక్చరర్ బి. సునీత, జూనియర్ లెక్చరర్ వి. వసుంధర గురువారం స్థానిక మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పిల్లల విద్యా సామర్థ్యాలను, ఉపాధ్యాయుల పనితీరుతోపాటు రికార్డులను పరిశీలించారు. టీచర్స్ టీం వర్క్‌ను వారు అభినందించారు. విద్యార్థుల సంఖ్యఇంకా పెంచాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. డైట్ విద్యార్థి కె. వికాస్ చేస్తున్న గ్యారెంటెడ్ ఎఫ్ఎల్ఎన్ సర్వేను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 డి.వి.డి. ప్రసాద్, ప్రధాన ఉపాధ్యాయుని వి. శోభారాణి, ఉపాధ్యాయులు సూరెడ్డి శ్రీనివాసరావు, సిరపరపు ఈశ్వరరావు, ఐ. రేవతి, ఇ. శివలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలపై సమీక్ష

రోలుగుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ పాఠశాలలో ఈ నెల 28, 29 తేదీల్లో ఉపాధ్యాయులకు నిర్వహించనున్న మండల స్థాయి క్రీడా పోటీలపై గురువారం ఎంఈఓ జగ్గారావు వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంలో పోటీల్లో భాగంగా ఇక్కడ కూడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పురుష ఉపాధ్యాయుల కోసం క్రికెట్, ఉపాధ్యాయినిలకు త్రోబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయి, డివిజన్ స్థాయి వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఈ మేరకు వ్యాయామ ఉపాధ్యాయులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ

» బస్సులో దొరికిన మంగళసూత్రం అప్పగింత


డ్రైవర్ శ్రీను

రావికమతం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దొరికిన బంగారు మంగళ సూత్రం అప్పగించి ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీని నిరూపించుకున్నారు. వివరాలివి.. నర్సీపట్నం ఆర్టీసీ డిపోలో మండలంలోని మేడివాడకు చెందిన ముచ్చకర్ల శ్రీను అవుట్‌సోర్సింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం సాయంత్రం నర్సీపట్నం వస్తుండగా భార్యాభర్తలు విశాఖలో తాను నడిపిన బస్సు ఎక్కి గాజువాకలో దిగారు. ఆ సమయంలో ఆ మహిళ మెడలోని ఒక మంగళ సూత్రం బస్సులో పడిపోయింది. ఇంటికి వెళ్లిన తర్వాత గుర్తించి గాజువాకలోని సిబ్బంది ద్వారా నుంచి విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు తెలిపారు. దీంతో ఆర్టీసీ అధికారులు బస్సు డ్రైవర్ శ్రీనుకు ఫోన్ చేశారు. ఆతను వెంటనే డిపోలో పార్కింగ్ చేసిన బస్సులో వెతకగా మంగళ సూత్రం దొరికింది. గురువారం ఆర్టీసీ అధికారుల సమక్షంలో పోగొట్టుకున్న గాజువాకకు చెందిన దంపతులకు మంగళసూత్రం అందజేశారు. శ్రీను నిజాయితీని పలువురు అభినందించారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ


గుమ్మాళ్ళపాడులో భూమి పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌నాథ్

రావికమతం: మండలంలోని గుమ్మాళ్ళపాడు రామాలయ నిర్మాణానికి గ్రామస్థులు గురువారం భూమి పూజ నిర్వహించారు. కశింకోటకు చెందిన ప్రముఖ వేద పండితులు రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. గతంలో ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.సర్పంచ్ బంటు సన్యాసినాయుడు, కొమిర ఎంపీటీసీ సభ్యురాలు బంటు విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీపీ పైల రాజు, బుచ్చియ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండ రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షులు కంచిపాటి జగన్నాథరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లింగ వివక్షతపై అవగాహన ర్యాలీ

రోలుగుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జెండర్ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం ఉషారాణి మాట్లాడుతూ లింక వివక్ష, హింస, అసమానతలను తొలగించే క్రమంలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల వీఏఓలు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే బండారు

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


కొత్తపెంటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేబండారు.సత్యన్నారాయణమూర్తి , కలెక్టర్ విజయ్‌కృష్ణన్, తదితరులు

దేవరాపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుకు కష్టం కలిగించే ఏ పని కూటమి ప్రభుత్వం చేయదని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మం డలంలోని కొత్తపెంటలో కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కలెక్టర్ స్వయంగా ధాన్యం నమూనాలను పరిశీలించారు. రిజిస్ట్రేషన్, గ్రేడింగ్‌పై అధికారులకు సూచించారు. అ నంతరం ఆమె మాట్లాడుతూ దళారీ వ్యవస్థను నమ్మరాదన్నారు. 75 కిలోల బస్తా రూ.1778కు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. దేవరాపల్లి మండలంలో ఆరు కొనుగోలు కేందాలు ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే బండారుసత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రైతు తీసుకు వచ్చిన ప్రతి గింజను కొనుగోలు కొనుగోలు చేస్తామన్నారు. మిల్లుకు వెళ్లిన 24 గంటల్లో రైతు ఖాతాకు సొమ్ము జమ చేస్తారన్నారు. లోడింగ్, రవాణా మొత్తం ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. నియోజక వర్గంలో 20 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎక్కడైనా జాప్యం జరిగితే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. సబ్సిడీపై అపరాల విత్తనాలను పంపిణీ చేశారు. ధాన్యం లోడింగ్ వాహనంను జెండా ఊపి తరలించారు. అనంతరం ఎమ్మెల్యేను అధికారులు సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఆయేషా, కొప్పల వెలమ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.జి. కుమార్, డీఎస్‌వో కె.వి.ఎల్ఎన్.మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.ఆశాదేవీ, సర్పంచ్ వెంకటరావు, మాజీ ఎంపీపీ భాస్కరరావు, జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, చిరికి గోవిందరావు, మండల టీడీపీ అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆడారి తులసీరావు విగ్రహ ప్రతిష్టకు శంకుస్థాపన

మాడుగుల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎం.కోటపాడు విశాఖడెయిరీ పాలకేంద్రం వద్ద విశాఖడెయిరీ మాజీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావు విగ్రహం ప్రతిష్టకు ఆయన కుమార్తె విశాఖడెయిరీ పాలకవర్గ సభ్యురాలు, ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి గురువారం శంకుస్థాపన చేశారు. స్థానిక పెద్దలు శానాపతి కొండలరావు, విశాఖడెయిరీ డైరెక్టర్ సూర్యనారాయణ, జోనల్ మేనేజర్ రాము, సిబ్బంది గండి జోగినాయుడు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వీరంగం.. వ్యక్తి పై కేసు నమోదు

కె.కోటపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వీరంగం సృష్టించిన వ్యక్తిపై కేసు నమోదైంది. బాధితులు, పోలీసులు అందించిన వివరాలివి.. మండలంలోని కింతాడ గ్రామానికి కింతాడ శ్రీను భార్య కాంతం బుధవారం స్కూటీపై ప్రయాణిస్తుండగా అడ్డగించి అదే గ్రామానికి చెందిన సిరపరపు శివ స్వామినాయుడు అనే వ్యక్తి అవమానకరంగా మాట్లాడాడు. స్కూటీ తాళంతో ఆమె ఎడమ చేతిపై గాయపరిచాడు. అనంతరం భర్తతో కలిసి కాంతం శివ ఇంటికి వెళ్లి నిలదీయగా మద్యం మత్తులో ఉన్నఅతను శ్రీనుపై అసభ్యరీతిలో మాట్లాడి, ప్రాణహాని చేస్తానని బెదిరించాడు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా నిందితుడు శివ స్వామినాయుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు గురువారం పోలీసులు తెలిపారు. గతంలో కూడా శివస్వామినాయుడు మర్డర్ కేసులో నిందితుడు. ప్రస్తుతం బెయిల్‌లో ఉన్నట్టు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు.

అనాథ యువతి వివాహానికి జనసేన యూత్ సాయం


వధువును ఆశీర్వదీస్తున్న జనసేన యూత్ సభ్యులు

రావికమతం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులులేని యువతికి చినపాచిల జనసేన యూత్ సభ్యులు అండగా నిలిచి గురువారం అన్నవరం దేవస్థానంలో వివాహం జరిపించారు. వివరాలివి.. గ్రామానికి చెందిన కేశం శెట్టి అప్పారావు, సత్యవతి దంపతులకు శాంతి, కోటేశ్వరి ఇద్దరు కుమార్తెలు. వీరి చిన్నతనంలో తల్లిదండ్రులు మృతి చెందారు. అక్కాచెల్లెల్లను అమ్మమ్మ చేరదీసి పదేళ్ళ వయస్సు వరకూ పెంచింది. అమ్మమ్మ కూడా మరణించింది. దీంతో బతుకుదెరువుకువేరే ప్రాంతానికి అక్కాచెల్లెళ్లు వెళ్లి, ఇటీవల వారు స్వగ్రామానికి వచ్చారు. వీరిని జనసేన యూత్ సభ్యులు అండగా నిలిచారు. శాంతి చెల్లి కోటేశ్వరినిమాడుగుల మండలం గొట్టివాడకు చెందిన నాగేష్ వివాహం చేసుకునేందుకు ముందుకు వచ్చాడు. జనసేన యూత్ సభ్యులు కోటేశ్వరికి, నాగేష్‌కు అన్నవరం దేవస్థానంలో గురువారం వివాహం జరిపారు. ఈ వివాహ ఖర్చులు, సారె సమకూర్చారు. నూతన దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. యూత్‌ను గ్రామస్థులు అభినందించారు.

విశాఖ డెయిరీ నిధులతో దసరా షెడ్డు నిర్మాణం


మాడుగులలో షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి

మాడుగుల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక దేవి ఆలయం ఎదుట విశాఖ డెయిరీ నిధుల తో చేపట్టనున్న దసరా షెడ్డు నిర్మాణానికి గురువారం ఎలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి శంకుస్థాపన చేశారు. నవరాత్రి ఉత్సవాలకు శాశ్వత షెడ్డు ఏర్పాటు చేయాలని దేవి ఆలయ కమిటీ అభ్యర్థన మేరకు విశాఖ డెయిరీ రూ. 5 లక్షల నిధులు మంజూరు చేసింది. మోదకొండమ్మ రమాకుమారి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవి ఆలయ గౌరవ అధ్యక్షుడు శీనాధ శ్రీనివాసరావు, అధ్యక్షుడు కొండలరావు, సర్పంచ్ యడ్ల కళావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ పుప్పాల అప్పలరాజు, దంగేటి సూర్యారావు, టీడీపీ నేత లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ వరహాలరావు, డెయిరీ డైరెక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

మోదకొండమ్మ పాదాలు, విగ్రహావిష్కరణ

మాడుగుల: స్థానిక మోదమాంబ కాలనీ మీదుగా వెళ్లే మార్గంలో పోతురాజుబాబు ఆలయ పక్కన ఏర్పాటు చేసిన మోదకొండమ్మ విగ్రహం, పాదాలను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతు రాజుబాబు పరిసర ప్రాంతాలకు చెం దిన రైతులంతా ఏటా తీర్థం నిర్వహించాలని ఆలోచన చేస్తున్నారు.

దత్తాత్రేయుని అఖండ నామ సంకీర్తన

మాడుగుల రూరల్: మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో దత్తాత్రేయుని సప్తాహ అఖండ నామ సంకీర్తనను గురువారం ప్రారంభించారు. స్థానిక పురోహితులు శ్రీనివాస భరణి శర్మ ఆధ్వర్యంలో వారం రోజులపాటు దత్తాత్రేయునికి పూజలు నిర్వహిస్తారు. చివరి రోజున దత్త హోమం, ప్రసాద వితరణ, పల్లకి సేవ నిర్వహిస్తారు.

తారువలో ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ

దేవరాపల్లి: మండలంలోని తారువ గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆల య శిఖర పునరప్రతిష్ఠ గురువారం ఘనంగా జరిగింది. మాజీ ఉపముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు, కె .కోటపాడు జడ్పీటీసీ అనూరాధ, మహిళలు పాల్గొన్నారు. అర్చకులు కాసుబాబు, పాకల కామేశ్వరరావు శర్మ తదితరులు పూజలు చేయించారు.

డ్రగ్స్ రహిత గ్రామాలే లక్ష్యం : సీఐ


మాట్లాడుతున్న కొత్తకోట సీఐ కోటేశ్వరావు

రావికమతం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డగ్స్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములుకావాలని కొత్తకోట సీఐ జి.కోటేశ్వరావు పిలుపు నిచ్చారు. మండలంలో కేబీపీ అగ్రహారం పంచాయతీ శివారు యర్రబంద గ్రామం రామాలయం వద్ద గురువారం స్థానిక ఎస్ఐ ఎం.రఘువర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు సరైన ప్రత్యేక శ్రద్ధ చూపలన్నారు. అలవాట్లకు బానిసలు కాకుండా బాధ్యత తీసుకోవాలన్నారు. సెల ఫోన్లను నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రౌతు సత్యనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పొంగలిపాకలో 'రైతన్నా..మీకోసం'


కరపత్రాల ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, నాయకులు

మాడుగుల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొంగలిపాక గ్రామంలో గురువారం రైతున్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో అప్పారావు, ఎంపీటీసీ షైచర్ల సన్యాసి రావు, స్థానిక పెద్దలు ఉండూరు దేముడు, నాయని సత్యనారాయణలు గ్రామంలో ఇంటింటికి వెళ్లి రైతన్న మీ కోసం కరపత్రాలు అందించారు. సంక్షేమ పథకాలు, వ్యవసాయానికి సంబంధించిన పలుఅంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దాత సాయంతో కళావేదిక నిర్మాణం

రావికమతం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికిప్రతి ఒక్కరూ సహకరించాలని తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు కోట నీలవేణి అన్నారు. కొత్తకోట జడ్పీ హైస్కూల్‌లో గ్రామానికి చెందిన వ్యాపారవేత్త కేదారి శెట్టి విశ్వనాథ్ సుమారు రూ.4లక్షలతో కళావేదిక నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు గురువారం భూమి పూజ నిర్వహించారు. టీడీపీ నాయకులు కోట గోవిందరావు, కోట సత్యనారాయణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ డి.శ్రీను, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాడుగుల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మాడు గుల, గాదిరాయి సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనులు కోసం శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీఎస్ఎం అప్పారావు తెలిపారు.

దేవరాపల్లి: మండలంలోని ఎం.అలమండలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అం తరాయం కలగ నుందని ట్రాన్స్‌కో ఏఈఈ కర్రి.శంకరరావు తెలిపారు.

కనకమహాలక్ష్మీ.. కరుణించవమ్మా!

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో తొలి గురువారం పూజలు వైభవంగా జరి గాయి. అమ్మవారి దర్శనానికి అర్ధరాత్రి నుంచి భక్తులు పోటెత్తారు. దీంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. వేదమం త్రాలు నాదస్వరాల మధ్య గణపతి పూజ, పుణ్యాహ వచనం, వేద పారాయణ, శ్రీ చక్రార్చన, లక్ష్మీ హోమం విశేష పూజలు నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఆలయ అధికారులు అర్ధరాత్రి తొలిపూజలు చేశారు. అనంతరం భక్తులు స్వయంగా అమ్మవారికి పసుపు కుంకుమ నీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. ఆ తరువాత అమ్మవారి విగ్రహాన్ని స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి రాత్రి 2.30 గంటల నుంచి భక్తుల దర్శనానికి అనుమతించారు. ఉదయం మరింతమంది భక్తులు రావడంతో కొత్తరోడ్డు వరకు క్యూలైన్లలో భక్తులు వేచి ఉన్నారు. ఆలయ అధికారులు తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జగన్నాథస్వామి ఆలయంలో సుమారు ఐదు వేల మందికి అన్న ప్రసాదం అందించారు. ఆలయం వద్ద ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


అమ్మవారిని పూలతో అలంకరణ

- అమ్మవారికి వైభవంగా తొలి గురువారం పూజలు
- దర్శనానికి అర్ధరాత్రి నుంచి పోటెత్తిన భక్తులు


కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

గంగాలమ్మకు లక్ష పసుపు కొమ్ముల అలంకరణ

మునగపాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలపేట గ్రామంలో గంగాలమ్మ ఆలయంలో మార్గశిర ఉత్సవాల్లో భాగంగా లక్ష పసుపు కొమ్ములతో అమ్మవారికి అలంకరణ చేశారు. తొలి గురువారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, లక్ష పసుపు కొమ్ములతో అలంకరించారు. అమ్మవారిని గ్రామ సర్పంచ్ బీశెట్టి గంగఅప్పలనాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు దర్శించుకున్నారు.


మూలపేటలో లక్ష పసుపు కొమ్ముల అలంకరణలో దర్శనమిచ్చిన గంగాలమ్మ

కనకమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఎలమంచిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మవరంలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి మార్గశిర మాసం తొలి గురువారం భక్తులు పోటెత్తారు. తొలిపూజా కార్యక్రమాన్ని మునిసిపల్ వైస్ చైర్మన్ ఆర్రెపు గుప్తా కుటుంబ సభ్యులు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. కమిటీ చైర్మన్ కొరారు సాంబ, ప్రతినిధులు ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, మహిళలు క్షీరాభిషేకం చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి నామ స్మరణతో ఆలయ ప్రాంతమంతా మార్మోగిపోయింది. మార్గశిర మాసం శుక్రవారం అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని కమిటీ చైర్మన్ కొరారు సాంబ తెలిపారు. ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పలు రైళ్ల గమ్యాలు కుదింపు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేకే లైనులో ఆధునికీకరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు రైళ్ల గమ్యాలను కుదించామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. వీటిలో డిసెంబరు 2, 29, 16న విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) విశాఖ నుంచి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ పాసింజర్ (58502) కోరాపుట్ నుంచి విశాఖకు నడుస్తాయి. అలాగే డిసెంబరు 1, 15న భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ (18447) భువనేశ్వర్ నుంచి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-భువనేశ్వర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ డిసెంబరు 2, 16న కోరాపుట్ నుంచి భువనేశ్వర్ వరకు నడుస్తాయన్నారు.

అన్నదాతకు.. అండగా..

జిల్లాలో విజయవంతంగా 'రైతన్నా-మీకోసం' వారోత్సవాలు

- ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహణ
- రైతుల నుంచి సలహాలు, ఫిర్యాదుల సేకరణ
- సమాచారాన్ని క్రోడీకరించి కలెక్టర్ ఆధ్వర్యంలో 2026-2027 కార్యాచరణ ప్రణాళిక తయారు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రైతుల కష్టసుఖాలను తెలుసుకొని ఆదుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో 'రైతన్నా-మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో రైతుల ఇళ్లకు వెళ్లి సమాచారాన్ని సేకరిస్తున్నారు. అంతేకాకుండా సలహాలు, ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. వీటన్నంటిని క్రోడీకరించి 2026-2027 కార్యాచరణ ప్రణాళికను తయారు చేస్తారు.

జిల్లాలో ఈనెల 24 నుంచి 'రైతన్నా-మీకోసం' వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇవి ఈనెల 30వ తేదీ వరకు జరగనున్నాయి. తొలి రోజు నుంచి రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దేవరాపల్లి మండలం కొత్తపెంటలో జరిగిన రైతన్నా మీకోసంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్‌తో కలిసి కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొన్నారు. పలువురు రైతుల ఇంటికి కలెక్టర్ స్వయంగా వెళ్లి కరపత్రాలను అందజేశారు. మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో అగ్రికల్చర్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది బృందంగా ఏర్పడి వారి పరిధిలోని ప్రతి రైతు ఇంటికీ వెళ్లి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ప్రతి మూడు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజించి, రోజుకు 30 కస్టర్లు చొప్పున 90 గృహాలను సందర్శిస్తున్నారు. రైతులను కలిసి ముఖాముఖి చర్చించి వ్యవసాయపరమైన సూచనలు, సలహాలు అందజేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మళ్లించేలా అవగాహన కల్పిస్తున్నారు. పంటల మార్పిడితో లాభాలను వివరిస్తున్నారు. నూతన, లాభదాయకమైన పంటలను ఎంపిక చేసుకొనేలా వారికి అవగాహన కల్పిస్తున్నారు. మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకొని దానికి అనుగుణంగా పంట మార్పిడి చేసుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా పంటల సాగులో ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించడం వంటి వాటిని రైతులకు వివరిస్తున్నారు. రైతుల నుంచి అధికారులు సూచనలతో పాటు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో ఈ కార్యక్రమానికి రైతుల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. జిల్లాలో 24 మండలాల్లో ఈ కార్యక్రమం ద్వారా 2,42,536 రైతు కుటుంబాలను ఇంటింటికీ వెళ్లి కలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బుధవారం నాటికి వ్యవసాయాధికారుల గణాంకాల ప్రకారం 1,61,691 రైతు కుటుంబాలను కలిసి వివరాలు సేకరించారు. మిగిలిన లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.


మునగపాకలో రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో రైతులకు కరపత్రాలు అందిస్తున్న అధికారులు

కార్యాచరణ ప్రణాళికపై సమావేశం

రైతన్నా మీకోసం కార్యక్రమం పూర్తయిన తర్వాత జిల్లా స్థాయి అధికారులు సమావేశమవుతారు. వారోత్సవాల్లో అధికారులు ఇంటింటికీ వెళ్లి సేకరించిన వివరాలపై కలెక్టర్ విజయకృష్ణన్ అధ్యక్షతన చర్చిస్తారు. అన్ని మండలాల వివరాలు క్రోడీకరించి డిసెంబరు 3వ తేదీన 2026-27 సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు.

ఇంటి స్థలాల కోసం భారీగా రిజిస్ట్రేషన్లు

పాయకరావుపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి గురువారం గ్రామ సచివాలయాలకు అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. ఇంటి స్థలం లేని పేదవారికి 3 సెంట్లు స్థలం, సొంతంగా స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారికి ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30వ తేదీలోపు సచివాలయాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో గురువారం మాసాహెబ్‌పేట, సత్యవరం, మంగవరం, తదితర గ్రామాలలో మహిళలు సచివాలయాలకు పెద్ద ఎత్తున చేరుకొని పేర్లు నమోదు చేయించుకున్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు 3 సెంట్లు ఇండ్ల స్థలాలను, ఇళ్లను కూటమి ప్రభుత్వం త్వరలోనే అందిస్తుందని తమ పేర్లను త్వరగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఎంసీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చి పేర్లను నమోదు చేసుకుంటున్నారన్నారు. సత్యవరం, మాసాహెబ్‌పేట, తదితర గ్రామాలలో కూటమి నాయకులు సచివాలయాల వద్ద ఇంటి స్థలాల దరఖాస్తులను తీసుకుని రిజిస్ట్రేషన్లు చేయించారు.


మాసాహెబ్‌పేట సచివాలయంలో ఇంటి స్థలాల కోసం పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న దృశ్యం



CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, LACHIREDDI SANYAS APPALANAIDU (Old name) S/o. Krishna, Resident of: FNo-6C, Reign Forest Apt., HP Petrol Bunk, Marikavalasa, Kommadi, Madhurawada, Visakhapatnam. Change my name from LACHIREDDI SANYAS APPALANAIDU (Old Name) to LATCHIREDDI S.A. NAIDU (New Name) hence forth I am being called as LATCHIREDDI S.A. NAIDU (New Name) for all purposes.
AJV_264007

GUEST HOUSE

» A/C గెస్ట్ హౌస్, గంటల చొప్పున కూడా రూమ్స్ అద్దెకు ఇవ్వబడును. పెదవాల్తేర్, విశాఖపట్నం. సంప్రదించు ఫోన్ నెంబర్స్ : 98664 91739.
AJV_242050

WANTED

» మన వైజాగ్‌లో ఆధారి గ్రూప్ నందు మార్కెటింగ్ చేయుటకు యువతీ, యువకులు, రిటైర్డ్ జెంటిల్‌మెన్స్ కావలెను. మీ ఆర్థిక సమస్యలకు ఆధారి గ్రూప్ ఒక్కటే సరైన మార్గం. సంప్ర: 83411 83101
AJG-179

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

అగ్రి ల్యాబ్ అందుబాటులోకి వచ్చేనా?

... 3వ పేజీ తరువాయి

అప్పగించింది. 2021 ఖరీఫ్ నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని అప్పటి నేతలు, అధికారులు ప్రకటించారు. అయితే నత్తనడకన సాగిన పనులు 2022 నాటికి 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఇంకా రూ.40 లక్షలకు సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. గత ప్రభుత్వం ఆ నిధులు మంజూరు చేయకపోవడంతో 2023 నుంచి పనులు ముందుకు కదల్లేదు. విద్యుత్, ఫ్లోరింగ్, ప్లంబింగ్ పనులు, భవనం చుట్టూ ప్రహరీ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. పనులు అర్థంతరంగా నిలిచిపోవడంతో ప్రస్తుతం భవనం పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి.

అగ్రి ల్యాబ్‌తో రైతులకు ఎంతో మేలు

అగ్రి ల్యాబ్ నిర్మాణం పూర్తయితే రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. మట్టి నమూనాలు, ఎరువులు, విత్తనాల పరీక్షలను ఇక్కడ ఉచితంగా నిర్వహిస్తారు. మట్టి నమూనా పరీక్షల ఆధారంగా పొలంలో ఏ పంట సాగు చేయాలి?, ఏయే సూక్ష్మపోషకాలు(ఎరువులు) వేయాలి? అనేది తెలుస్తుంది. ప్రైవేటు దుకాణాల్లో రైతులు కొనుగోలు చేసే రసాయన ఎరువులు, విత్తనాల నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షిస్తారు. నిర్దేశించిన ప్రమాణాలు లేకపోతే సంబంధిత వ్యాపారులు, సంస్థలపై చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటికీ కొళాయి సాకారం దిశగా..

... 3వ పేజీ తరువాయి

ట్యాంక్‌లోకి పంపుతారు. ఇక్కడ నీరు శుద్ధి చేసే యూనిట్, ప్రత్యేకంగా పంపు హౌస్ నిర్మిస్తారు.

శుద్ధి చేసిన జలాలు రిజర్వాయర్లకు సరఫరా

నర్సీపట్నంలోని 28 వార్డులను నాలుగు జోన్లు కింద విభజించి నాలుగు రిజర్వాయర్ల ద్వారా నీటి సరఫరా చేస్తారు. నర్సీపట్నం సీబీఎం కాంపౌండ్ వద్ద 10 లక్షల లీటర్లు, పాత మునిసిపాలిటీ కార్యాలయం వెనుక 9 లక్షల లీటర్లు, బలిఘట్టం పాత పంచాయతీ కార్యాలయం వద్ద 8 లక్షల లీటర్లు, పెద్ద బొడ్డేపల్లిలోని కొత్త మునిసిపల్ కార్యాలయం వద్ద 7 లక్షల లీటర్లు సామర్థ్యం చొప్పున ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్లు నిర్మిస్తారు. ఈ రిజర్వాయర్ల ద్వారా నర్సీపట్నం, బలిఘట్టం, పెదబొడ్డేపల్లి ప్రాంతాలలోని ప్రతీ ఇంటికి శుద్ధి చేసిన జలాలు సరఫరా చేస్తారు.

రెవెన్యూ డివిజన్‌గా నక్కపల్లి

... 3వ పేజీ తరువాయి

అందజేయాల్సి ఉంటుంది. ప్రజల నుంచి అందిన సలహాలు, సూచనలు, అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం సమగ్ర నివేదికను మరోసారి కలెక్టర్ ప్రభుత్వానికి పంపనున్నారు. కలెక్టర్ నివేదిక ఆధారంగా నక్కపల్లి కేంద్రంగా కొత్త డివిజన్‌ను ఏర్పాటు చేస్తూ, ప్రభుత్వం తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నది.

టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గాజువాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యువతకు ఫోర్ వీలర్ సర్వీసెస్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని గాజువాక ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్టీల్‌సిటీ న్యూ ఐటీఐలో శిక్షణ ఉంటుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18-35ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులని, వచ్చే నెల 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 81217 43777 నంబరులో సంప్రదించాలన్నారు.

జనవరిలో పలు ప్రధాన రైళ్లు రద్దు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గోదావరి-రాజమండ్రి, రాజమండ్రి-కడియం సెక్షన్లలో ఆధునికీకరణ నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో జనవరిలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

జనవరి 27న తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ (17480), 28న పూరి-తిరుపతి (17479), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ (22708); 28, 29 తేదీల్లో విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805), మచిలిపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219); 29న విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707), 29, 30 తేదీల్లో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806), విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), 28, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), 29, 31 తేదీల్లో విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), విశాఖపట్నం-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (67286), జనవరి 31న గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22575) రద్దు కానున్నట్టు పేర్కొన్నారు.

3 నుంచి నృసింహ దీక్షలు

దీక్ష ధారులకు ఉచితంగా తులసిమాలలు, స్వామి ప్రతిమలు

సింహాచలం దేవస్థానం ఈవో సుజాత

సింహాచలం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మపరిరక్షణకు, సింహాచలం క్షేత్ర మహత్మ్యం ప్రచారానికి ఉద్దేశించిన నృసింహ దీక్షలకు డిసెంబరు 3వ తేదీన శ్రీకారం చుట్టనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్.సుజాత ప్రకటించారు. దేవాలయ వైదిక కమిటీ నిర్ణయం మేరకు సంప్రదాయ విధానంలో మాలధారణ ప్రారంభమవుతుందన్నారు. వచ్చే ఏడాది జనవరి 12న దీక్షల విరమణ జరుగుతుందన్నారు. ద్వాత్రింశతి దీక్షలు డిసెంబరు 11న ప్రారంభమై జనవరి 12న పరిసమాప్తమవుతాయన్నారు. దీక్షలు స్వీకరించు భక్తులకు ఉచితంగా తులసి మాలలు, స్వామివారి ప్రతిమలను అందజేస్తామన్నారు.

క్రైం... crime news

కొంగసింగిలో వివాహిత ఆత్మహత్య

- భర్తకు ఆన్‌లైన్ బెట్టింగ్ వద్దని చెప్పినా వినకపోవడంతో మనస్తాపంతో అఘాయిత్యం

కృష్ణాదేవిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కొంగసింగిలో బుధవారం రాత్రి వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంబిల్లి మండలం మామిడివాడ గ్రామానికి చెందిన పప్పల లక్ష్మీపార్వతి (26)తో నాలుగేళ్ల క్రితం కొంగసింగి గ్రామానికి చెందిన అరటా ప్రసాద్‌కు వివాహమైంది. వీరికి మూడున్నరేళ్లకుమారుడు ఉన్నాడు. లక్ష్మీపార్వతి భర్త ప్రసాద్ నావీలో ఉద్యోగం చేస్తూ గత నెలలో పదవీవిరమణ పొందాడు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం నుంచి నెల రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చేశారు. అయితే భర్త ఆన్‌లైన్ బెట్టింగ్ చేస్తూ అప్పులపాలు అయ్యాడు. దీంతో ఆన్‌లైన్ బెట్టింగ్ వద్దని పలుమార్లు భర్తను వారించిన ఆయన పట్టించుకోలేదు. ఈ విషయమై బుధవారం భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదం జరిగిందని గ్రామస్థులు అంటున్నారు. రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో లక్ష్మీపార్వతి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం కుటుంబ సభ్యులు తలుపుకొట్టగా తీయకపోవడంతో తలుపులు పగలుగొట్టి చూడగా ఉరివేసుకొని ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే గొలుగొండ ఎస్ఐ పి.రామారావు, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై మృతురాలు తల్లి పప్పల కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.


లక్ష్మీపార్వతి (ఫైల్‌ఫొటో)

ఓవర్‌లోడు లారీకి రూ.56 వేలు జరిమానా

అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో వెళ్తున్న క్వారీ లారీకి గురువారం ఆర్‌టీవో కార్యాలయ అధికారులు రూ. 56వేలు జరిమానా విధించారని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. జలగలమదుం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సుంకరమెట్ట జంక్షన్ మీదుగా జలగలమదుం నుంచి జాతీయ రహదారి వైపు వెళ్లేందుకు వస్తున్న ఓవర్‌లోడు లారీని ఆపి తనిఖీ చేయగా అధిక లోడు ఉందని సీఐ తెలిపారు. ఈ విషయాన్ని ఆర్‌టీఓ కార్యాలయ అధికారులకు తెలియజేశామన్నారు. దీంతో వారు వచ్చి లారీకి రూ.56వేలు జరిమానా విధించారని సీఐ తెలిపారు.

నేటి నుంచి మూడు నెలలు శుభ ముహూర్తాలు లేవు

అచ్యుతాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28 నుంచి మూడు నెలలు శుభ ముహూర్తాలు లేవు. ఈనెల 28 నుంచి 2026 ఫిబ్రవరి 14 వరకు శుక్ర మూఢం. మూఢమి సమయంలో వివాహాది శుభ ముహూర్తాలుండవు. తిరిగి 2026 ఫిబ్రవరి 19 నుంచి శుభ ముహూర్తాలు ప్రారంభం అవుతాయి.

మూఢమిలో చేయకూడనవి: ఈ సమయంలో పూరోహితులు, బ్రాహ్మణులు, టెంట్‌హౌస్, లైటింగ్, కేటరింగ్ చేసేవారికి కొంత ఆదాయం తగ్గుతుంది. మూఢమిలో యజ్ఞ, యాగాదులు, వివాహ, ఉపనయనాలు, దేవతా ప్రతిష్ఠలు, క్రతువులు, బావులు, చెరువులు తవ్వించుట, నూతన గృహారంభాలు, గృహప్రవేశాలు, చెవులు కుట్టుట, నూతన వ్యాపారాలు ప్రారంభించకూడదు.

మూఢమిలో చేయదగిన కార్యక్రమాలు : జపహోమాది శాంతులు, గ్రహ శాంతికి అభిషేకాలు, ఆశ్రేష, మూల వంటి గండ నక్షత్రాలకు శాంతులు, సమస్త వ్రతాలు, ఉత్పాదక దోష శాంతులు చేయవచ్చును.

కోటవురట్ల ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప అవార్డు కమిటీ


వెంటిలేటర్ యూనిట్‌ను పరిశీలించి వివరాలు అడుగుతున్న కమిటీ సభ్యులు

కోటవురట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల వైద్య విధానపరిషత్ 50 పడకల ఆస్పత్రిని కాయకల్ప అవార్డు కమిటీ గురువారం సందర్శించింది. ఉదయం 11 గంటలకు వచ్చిన బృందం సభ్యులు డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ కళ్యాణరావు ఆస్పత్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలు పరిశీలించారు. అనంతరం చార్టు ప్రకారం మందులు అన్ని ఉన్నాయా.. లేదా.. ఆరా తీశారు. పేషెంట్లకు ఇచ్చే మందులు, ఇంజక్షన్లు వినియోగంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో తాగునీరు, వాడకం నీరు వినియోగంలో జాగ్రత్తలను సిబ్బంది వివరించారు. రక్తపరీక్షలు చేసే ల్యాబ్‌లో రక్తం చుక్క కింద పడిపోతే ఏమి జాగ్రత్తలు తీసుకుంటున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత, అందుతున్న సేవలు తెలుసుకున్నారు. ఆకస్మికంగా అగ్నిప్రమాదం సంభవిస్తే ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటారని సెక్యూరిటీ గార్డు అప్పారావును ప్రశ్నించారు. ఆస్పత్రిలో శానిటేషన్ రోజుకు ఎన్ని సార్లు చేస్తున్నారని ప్రశ్నించగా.. రోజు రెండు సార్లు క్లీనింగ్ చేస్తున్నామని సిబ్బంది బదులిచ్చారు. మరుగుదొడ్ల శుభ్రత పరిశీలించారు. చంటిపిల్లలు, కాన్పుల వార్డులు, పరిసరాలను తనిఖీ చేశారు. అనంతరం బృందం సభ్యుడు డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ జిల్లాలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి, కె.కోటపాడు, మాడుగుల, కోటవురట్ల ఆస్పత్రులను పరిశీలించామన్నారు. వాటిలో కోటవురట్ల ఆస్పత్రి మెరుగ్గా ఉన్నట్టు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు నక్కపల్లి ఆస్పత్రిని పరిశీలించారు. జిల్లా స్థాయి బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర కమిటీ జనవరిలో వచ్చి పర్యటిస్తుందని, ఆ కమిటీ అవార్డు అర్హతపై నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తుందన్నారు. వారి వెంట డాక్టర్లు అనూష, ఝాన్సీ, కనక మహలక్ష్మి, హెడ్‌నర్సు పద్మవతి తదితరులు పాల్గొన్నారు.

'మత్స్యకారుల స్థితిగతులు మెరుగుపరుస్తాం'

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల జీవన ప్రమాణాలు, స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచి వారి జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని ఏపీ మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు పేర్కొన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో గురువారం ఆయన పర్యటించారు. మత్స్య సంపదతో లక్షలాదిమంది ఉపాధి పొందుతున్నారన్నారు. ఎగుమతుల ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.కోట్ల ఆదాయం సమకూరుతోందన్నారు. మత్స్యకారులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కాలుష్యం కారణంగా మత్స్య సంపద హరించిపోయే ప్రమాదం ఉందన్నారు. మత్స్యకారులకు రాజకీయంగా గుర్తింపునిచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. రూ.1.7 కోట్లు విలువచేసే వేట సామగ్రి, బోట్లు సబ్సిడీపై అందజేసిందన్నారు. అనంతరం మత్స్యకారుల సమస్యలను తెలుసుకున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639